నేటి కందం- నేటికి అందం

చీకటిపై విజయమ్మును
రాకాశశి పొందినట్లు రసరమ్యముగాన్
తేకువతో క్రిక్కెటులో
పాకీస్థానమ్ము పైన భారత్ గెలిచెన్ !!
(చీకటి మీద చంద్రుడు విజయం సాధించినట్లు క్రికెట్ లో పాకిస్థాన్ మీద భారత్ అఖండమైన అమేయమైన విజయం సాధించింది.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ప్రతిపక్షం బలహీన
పడితే ప్రశ్న ప్రమాదం
సర్కారు ఏకపక్ష
చర్యలకు ఆమోదం.
కొద్దో గొప్పో చట్టసభలో
కొట్లాడితే కదా మంచి
లేకుంటే జనస్వామ్యం
లొంగిపోదా తలవంచి

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 17-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:156 పేజీలు:6 వెల: రూ.1/-


## డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ దంపతులు..



హైదరాబాద్, ఫిబ్రవరి 16: వైరా మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైన డాక్టర్ కాపా చంద్రకళ మొట్టమొదటిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులు కోసం మధిర క్యాంప్ ఆఫీసుకు తరలి వెళ్లారు.. డిప్యూటీ సీఎం కలిసి డాక్టర్ కాపా మురళీకృష్ణ డాక్టర్ కాప చంద్రకళ దంపతులు ఆయన ఆశీస్సులు తీసుకున్నారు వైరాను మోడల్ సిటీగా తీర్చిదిద్దే బాధ్యత నాదేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

మున్సిపాలిటీ చైర్మన్గా వైరా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో.. లైన్స్ క్లబ్ లో అత్యున్నత స్థానమైన గవర్నర్ స్థానానికి ఎన్నికై ఎంతో ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ మురళీకృష్ణ సహకారాన్ని పూర్తిస్థాయిలో తీసుకోవాలని డాక్టర్ మురళీకృష్ణ మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళకు మల్లు భట్టి విక్రమార్క సూచించారు? కనీ విని ఎరుగని రీతిలో వైరా మున్సిపాలిటీని రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల కన్నా గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చే విధంగా అభివృద్ధి జరగాలని దానికి తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నట్లు డాక్టర్ చంద్రకళ తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్,. డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్ తదితరులు డిప్యూటీ సీఎంను కలిశారు..

## ఎన్నిక వాయిదా వేయడం దుర్మార్గం: ఎర్రబెల్లి దయాకర్ రావు

మహబూబాబాద్ ఫిబ్రవరి 16: తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన విమర్శించారు..

ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. పరిస్థితులు సజావుగా ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయడం దుర్మార్గమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను సంప్రదించేందుకు ఫోన్ చేసినా స్పందించలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. తొర్రూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా నేపథ్యంలో జిల్లా రాజకీయాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## భారత్ వేగవంతమైన అభివృద్ధికి ఏఐ సమ్మిట్ నిదర్శనం : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను నిర్వహిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని అన్నారు. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందని చెప్పారు.

సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమని ప్రధాని అన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమ్మిట్ మన దేశంలో జరుగుతుండటం గర్వకారణమని చెప్పారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం)' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు.

ఈ ఏఐ సమ్మిట్‌వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని ప్రధాని చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన లాంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఇవాళ్టి నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయని చెప్పారు. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతమవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశమని ప్రధాని మోదీ వెల్లడించారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

అమరావతి, ఫిబ్రవరి 16: దోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులో పెద్ద ప్రమాదం తప్పింది. చింతల సమీపంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు కొండను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 62 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ బస్సు శ్రీశైలం నుండి డోన్ వైపు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఘాట్ రోడ్డులో మలుపు వద్ద బ్రేకులు పనిచేయకపోవడంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును కొండ వైపు మళ్లించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. గమనించిన స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ప్రయాణికులకు సహాయం చేశారు. అనంతరం అధికారులకు సమాచారం అందించారు.

## కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం.. ఏడుగురు కార్మికులు మృతి



జైపూర్, ఫిబ్రవరి 16: కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఏడుగురు కార్మికులు మరణించారు. సుమారు పది మంది కార్మికులు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాజస్థాన్‌లోని భివాడిలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ రసాయన కర్మాగారంలో మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే ఆ ఫ్యాక్టరీ మొత్తం మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో సుమారు 25 మంది కార్మికులు అక్కడ పని చేస్తున్నారు.

కాగా, మంటలను గమనించిన పలువురు కార్మికులు కెమికల్ ఫ్యాక్టరీ నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గంటన్నరపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఏడుగురు కార్మికులు మరణించినట్లు గుర్తించారు. మరో పది మంది ఆచూకీ తెలియడం లేదు. ఆ ఫ్యాక్టరీలో లోపల వారు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ, జిల్లా అధికారులు తెలిపారు. మంటలకు కారణాన్ని గుర్తించడానికి, భద్రతా ప్రోటోకాల్స్‌లో లోపాలపై దర్యాప్తు కోసం మెజిస్టీరియల్ విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది.

## జెఇఇ మెయిన్స్ ఫలితాలు విడుదల..

హైదరాబాద్ ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఇతర కోర్సుల ఎంట్రెన్స్ కోసం విద్యార్థుల రాసే జెఇఇ మెయిన్స్ పరీక్షల ఫలితాలు వచ్చాయి. ఇందులో ముగ్గురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ముగ్గురికి 100 పర్సెంటైల్ వచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి వివన్ శరద్ మహేశ్వరికి, ఎపికి చెందిన ఇద్దరు విద్యార్థులు జి.నరేంద్ర బాబు, పసల మోహిత్‌కు 100 పర్సెంటైల్ వచ్చింది. ఒబిసి కేటగిరీలో నరేంద్రబాబు టాపర్‌గా నిలిచాడు. ఎస్సి కేటగిరీలో ఎపి విద్యార్థి దేవ శ్రీవేద్ టాపర్‌గా నిలిచాడు. ఈసారి 13.04 లక్షల మంది జెఇఇ మెయిన్స్ రాశారు.

## రాష్ట్రవ్యాప్తంగా పలు కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

హైదరాబాద్ ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్); రాష్ట్రవ్యాప్తంగా పలు కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగాం,తొర్రూర్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా బిఆర్‌ఎస్ -9, కాంగ్రెస్ -7 గెలుచుకున్నాయి. దీంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎంఎల్‌ఎ యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో బలాబలాలు సమానమయ్యాయి. ఈ నేపథ్యంలో కడియం కావ్య ఓటుపై అభ్యంతరం చేస్తూ బిఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు.

## కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణ



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఎ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

### 100 వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక :

గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ప్లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు.. అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్ట్..

హైదరాబాద్, ఫిబ్రవరి 16: హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ అక్రమ రవాణా మరోసారి బయటపడింది. గచ్చిబౌలి ప్రాంతంలో ఈగల్ టీమ్ నిర్వహించిన తనిఖీల్లో కొకైన్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టైంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 32 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌తో పాటు మొత్తం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో భాగంగా పోలీసులు కొండాపూర్‌లోని వెంకటరమణ రెసిడెన్సీలో సోదాలు నిర్వహించారు. అక్కడ డ్రగ్స్ నిల్వ చేసి, నగరంలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్‌ను గోప్యంగా నిల్వ చేసి, అవసరమైనప్పుడు వినియోగదారులకు అందించే విధంగా ముఠా పనిచేస్తున్నట్లు వెల్లడైంది.

పోలీసుల విచారణలో ఈ ముఠా డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ద్వారా రవాణా చేస్తున్నట్లు బయటపడింది. ఈ విధంగా రవాణా చేయడం ద్వారా పోలీసులు గుర్తించకుండా ఉండాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ట్రావెల్స్ బస్సులను వినియోగించడం ద్వారా అనుమానం రాకుండా డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చినట్లు వెల్లడైంది. ఈ ముఠా గ్రాముకు రూ.7,000కు కొకైన్ కొనుగోలు చేసి, నగరంలో గ్రాముకు రూ.12,000కు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా భారీ లాభాలు పొందుతున్నట్లు విచారణలో తేలింది. నగరంలోని ఐటీ ఉద్యోగులు, యువత ప్రధానంగా ఈ డ్రగ్స్ వినియోగదారులుగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. డ్రగ్స్ సరఫరా కోసం ముఠా ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా వాట్సాప్ కాల్స్ ద్వారానే వినియోగదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఫోన్ కాల్స్ చేయడం లేదా ప్రత్యక్షంగా కలవడం చేయకుండా.. వాట్సాప్ కాల్స్ ద్వారా మాత్రమే ఆర్డర్లు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ డెలివరీ కోసం డెడ్ డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ విధానంలో డ్రగ్స్‌ను ఒక నిర్దిష్ట ప్రాంతంలో వదిలి, వినియోగదారులకు ఆ లొకేషన్‌ను తెలియజేస్తారు. వినియోగదారులు అక్కడికి వెళ్లి డ్రగ్స్‌ను తీసుకెళ్తారు. ఈ విధానం ద్వారా సరఫరాదారులు, వినియోగదారులు ప్రత్యక్షంగా కలవకుండా ఉండటం వల్ల పోలీసులు గుర్తించడం కష్టమవుతుంది. మరో కీలక అంశం ఏంటంటే, ముఠా సభ్యులు తమ బ్యాంక్ అకౌంట్లను వినియోగించకుండా, స్నేహితుల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా తమ అసలు గుర్తింపును దాచడానికి ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారు కొకైన్ వినియోగించినట్లు నిర్ధారణ అయింది. ఈ కేసులో ఇప్పటివరకు 15 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు గుర్తించారు. వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## కార్ పార్కింగ్‌లో శవమై కనిపించిన వాచ్‌మన్..

హైదరాబాద్, ఫిబ్రవరి 16: హైదరాబాద్‌లోని చైతన్య పురిలో అనుమానాస్పద మృతి కలకలం రేపింది. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓ భవనంలో వాచ్‌మన్ శవమై కనిపించాడు. కార్ పార్కింగ్ లిఫ్ట్ రాడ్స్‌కు ఉరిబిగించిన స్థితిలో వాచ్‌మన్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. చామల ముత్తయ్య గత కొన్నేళ్లుగా ఓ వ్యక్తి దగ్గర పని చేస్తున్నాడు. ముత్తయ్య యజమాని చైతన్యపురిలో భవనం నిర్మిస్తున్నాడు. ఆ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఇలాంటి సమయంలో ముత్తయ్య అనుమానాస్పద స్థితిలో భవనంలో శవమై కనిపించాడు.

కార్ పార్కింగ్ లిఫ్ట్ రాడ్స్‌కు ఉరిబిగించిన స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముత్తయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముత్తయ్యది ఆత్మహత్య కాదని, హత్యేనని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని, యజమానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం : ఎంపీడీఓ జ్ఞానప్రకాశరావు



నల్గొండ, ఫిబ్రవరి 16: గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని కట్టంగూర్ ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధి పనుల పర్యవేక్షణ, గ్రామ సభలో పాల్గొనడం, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని తెలిపారు. శిక్షణ ద్వారా వార్డు సభ్యులకు బాధ్యతలు, అధికారులు, పరిపాలనా విధానం, ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ పారదర్శక పాలనపై అవగాహన కలుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి స్వరూపారాణి, మండల పరిషత్ పర్యవేక్షకులు చింతమల్ల చలపతి, టీఓటీలు వెంకన్న, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.

# అరుదైన ఖగోళ అగ్ని వలయం

## (17 ఫిబ్రవరి "భారత్‌లో కంకణాకార సూర్యగ్రహణం" ఆవిష్కృతం అవుతున్న వేళ)

భారత్‌లో 17 ఫిబ్రవరి 2026 రోజున ఖగోళ దృశ్యం ఆవిష్కృతం అవనున్నది. ఈ రోజు అరుదైన కంకణాకార సూర్యగ్రహణం సంభవించనుంది. 2026లో తొలి సూర్యగ్రహణంగా గుర్తించబడి ఖగోళ శాస్త్రవేత్తల్లో ఉత్సుకతను రేకెత్తిస్తున్నది. ప్రధానంగా అంటార్కిటికా, దక్షిణాఫ్రికా ప్రాంతాల్లో కూడా కనిపించే సూర్యగ్రహణం 17 ఫిబ్రవరి రోజు మధ్యాహ్నం 3:26 గంటలకు ప్రారంభమై రాత్రి 7:57 గంటలకు ముగుస్తుంది. చంద్రుడు భూమి నుంచి ఎక్కువ దూరంలో ఉండి సూర్యుడి కన్న చిన్నగా కలిపిస్తాడు. సూర్యుడు మరియు భూమి మధ్య ప్రయాణించి, సూర్యుడి కేంద్రాన్ని కమ్మి, దాని బయటి అంచులు కనిపించే విధంగా ప్రకాశవంతమైన వలయాన్ని సృష్టిస్తుంది. ఈ వలయాన్ని 'అగ్ని వలయం (రింగ్ ఆఫ్ ఫైర్)' లేదా 'కంకణాకార సూర్యగ్రహణం'గా పిలవడం జరుగుతున్నది. ఈ వలయం సుమారుగా 2 నిమిషాల 20 సెకన్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సమయంలో చంద్రుడు సూర్యుడిని దాదాపు 96 శాతం కప్పివేస్తాడు. ఈ గ్రహణం భారతదేశం నుంచి చూడలేం.

సూర్యగ్రహణ సమయంలో సూర్యుడిని నేరుగా చూస్తే దృష్టి సమస్యలు రావచ్చని గమనించాలి. ఆధునిక శాస్త్రంతో పాటు వేద సంప్రదాయ కలయికగా ఈ అద్భుతమైన భౌతిక దిగ్విజయం అని తెలుసుకోవాలి. ఈ సూర్యగ్రహణ కాలాన్ని "సూతక్ కాలం" లేదా "సూతకం" అని పిలుస్తాం. మనకు కనిపించని పగటి పూట సంభవిస్తున్న సూర్యగ్రహణ సమయంలో సూతకం ఉండదు కాబట్టి భారతదేశంలో అన్ని రోజువారీ కార్యక్రమాలు, దేవాలయాల దర్శనం కొనసాగించవచ్చు. 03 మార్చి 2026 రోజు మరో సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించనున్నది. సూర్యగ్రహణం అనే ఒక ఖగోళ సంఘటన ప్రభావం 12 రాశిచక్రాలపై అనుభూతి చెందుతుంది. గ్రహణ సమయంలో సూర్యుడు కుంభరాశిలో ఉన్నందున శుభప్రదమని భావించాలి.

ఖగోళ అద్భుతాలను అవగాహన చేసుకుంటూ, నక్షత్ర గ్రహ ఉపగ్రహాల కదలికలను గమనిస్తూ మన విజ్ఞాన రెక్కలను బలీయం చేసుకుందాం. కంకణాకార సూర్యగ్రహణం మానవాళికి మేలు చేయాలని కోరుకుందాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఢిల్లీలో 'సేవా తీర్థ్', 'కర్తవ్య భవన్-1, 2' ప్రారంభోత్సవ విశేషాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఈ రోజు ఢిల్లీలో నిర్వహించిన 'సేవా తీర్థ్', కర్తవ్య భవన్-1, 2' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మనమందరం ఒక కొత్త చరిత్ర నిర్మాణాన్ని వీక్షిస్తున్నామని వ్యాఖ్యానించారు. సేవా తీర్థ్‌తో పాటు ఈ నూతన భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా పీఎంఓ బృందం, క్యాబినెట్ కార్యదర్శి, వివిధ విభాగాల ఉద్యోగులతో సహా అందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. వీటి నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజనీర్లు, కార్మిక మిత్రులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వరుస పోస్ట్‌లలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ విధంగా పేర్కొన్నారు:

"భారత ప్రజలకు సేవ చేయాలనే అచంచలమైన సంకల్పంతో నాగరిక దేవో భవ అనే పవిత్ర భావనతో సేవా తీర్థ్‌ను వినమ్రంగా దేశానికి అంకితం చేస్తున్నాను. సేవా తీర్థ్ ఎల్లప్పుడూ కర్తవ్యానికి, కరుణకు, దేశమే ప్రథమం అనే సూత్రబద్ధమైన నిబద్ధతకు ఒక ప్రకాశవంతమైన చిహ్నంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను. నిస్వార్థ సేవ, సర్వజన సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేసే మార్గంలో నడవడానికి ఇది రాబోయే తరాలకు స్ఫూర్తినివ్వాలి."

"అలాగే ఈరోజు 'సేవా తీర్థ్' వద్ద పేదలు, అణగారిన వర్గాలు, కష్టపడి పనిచేసే మన రైతులు, యువశక్తి, నారీశక్తి సాధికారతకు సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేశాను. ఆ కీలక నిర్ణయాలు ఇవే:

ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించే పీఎం రహత్ పథకానికి ఆమోదం. ఇది ప్రమాదానికి గురైన ఎవరికైనా తక్షణ వైద్య సహాయం అందేలా చేస్తుంది.

లఖ్‌పతి దీదీ పథకం లక్ష్యాన్ని 6 కోట్లకు రెట్టింపు చేయడం. ఇది మహిళా సాధికారత, స్వయం సమృద్ధిని పెంచుతుంది.

వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి లక్ష్యాన్ని రూ. 1 లక్ష కోట్ల నుంచి రూ. 2 లక్షల కోట్లకు రెట్టింపు చేశారు. ఇది మన రైతులు, వారి ఆదాయాన్ని పెంచడానికి ఎంతో సహాయపడుతుంది.

రూ. 10,000 కోట్ల మూలధనంతో స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం. ఇది ప్రారంభ దశలో ఉన్న అంకురాలు, అధునాతన సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహిస్తుంది."

"దేశప్రజల సేవ పట్ల అచంచలమైన సంకల్పం, 'నాగరిక దేవో భవ' అనే పవిత్ర భావనతో ఈ రోజు సేవా తీర్థ్‌ను దేశానికి అంకితం చేసే భాగ్యం నాకు లభించింది.

'సేవా తీర్థ్' అనేది కర్తవ్యం, కరుణ, దేశమే ప్రథమం అనే మన నిబద్ధతకు ఒక శక్తిమంతమైన చిహ్నం. ఇది రాబోయే తరాలకు నిస్వార్థ సేవ, జనోద్ధరణ కోసం అంకితభావంతో ముందుకు సాగడానికి స్ఫూర్తినిస్తూ ఉండాలని కోరుకుంటున్నాను."

"ఢిల్లీలో ఈ రోజు 'సేవా తీర్థ్', 'కర్తవ్య భవన్' ప్రారంభోత్సవం సందర్భంగా సేవా తీర్థ్ స్మారక తపాలా బిళ్ల, నాణేన్ని విడుదల చేయడం గర్వంగా ఉంది."

"నేను ఏ అమృత భావనతో అయితే 'సేవా తీర్థ్', 'కర్తవ్య భవన్'ను దేశానికి అంకితం చేశానో అది 140 కోట్ల దేశప్రజల ఆకాంక్షలు, అంచనాలను నెరవేర్చడానికి ఒక బలమైన పునాదిగా మారుతుంది."

"గత 11 ఏళ్లుగా మనం బానిసత్వ మనస్తత్వాన్ని మార్చే ఉద్యమంలో నిమగ్నమై ఉన్నాం. మన మంత్రం ఒక్కటే.. 'స్వతంత్ర భారతానికి స్వతంత్ర గుర్తింపు, బానిసత్వ ఆనవాళ్ల నుంచి విముక్తి!'"సేవా తీర్థ్' అనే పేరులోనే ఒక గొప్ప సందేశం ఉంది. అది దేశ ప్రజల సేవ అనే సంకల్పాన్ని లక్ష్యం వరకు తీసుకెళ్లే ఒక పవిత్ర స్థలం!"

"కర్తవ్యం అనేది ఈ సజీవ దేశానికి ప్రాణవాయువు వంటిది. ఇది కోట్లాది మంది దేశ ప్రజల కలలను సాకారం చేయాలనే మన సంకల్పానికి సరికొత్త శక్తిని ఇస్తోంది."

" 'నాగరిక దేవో భవ' అనేది మన పని సంస్కృతి. 'సేవా తీర్థ్'లో తీసుకొనే ప్రతి నిర్ణయం 140 కోట్ల దేశప్రజల జీవితాలను మరింత మెరుగుపరుస్తుంది."

## మార్కెట్ ఆధారిత పట్టణ పరివర్తనను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా రూ. లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ నిధికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర కేబినెట్ లక్ష కోట్ల రూపాయల కేంద్ర సహాయం (సీఏ) తో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ను ప్రారంభించడానికి ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు వ్యయంలో 25 శాతాన్ని సీఏ కవర్ చేసుంది. మార్కెట్ ద్వారా కనీసం 50 శాతం ప్రాజెక్టు వ్యయం సేకరించనున్నారు. ఇది వచ్చే ఐదు సంవత్సరాల్లో పట్టణాభివృద్ధి రంగంలో మొత్తం రూ. నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులకు వీలు కల్పిస్తుంది. గ్రాంట్ ఆధారిత ఫైనాన్సింగ్ నుంచి మార్కెట్-అనుసంధానిత, సంస్కరణ-ఆధారిత, ఫలితాల-ఆధారిత మౌలిక సదుపాయాల కల్పన వరకు భారత పట్టణాభివృద్ధి విధానంలోని నమూనా మార్పును ఇది సూచిస్తుంది.

మార్కెట్ ఫైనాన్స్, ప్రైవేట్ భాగస్వామ్యం, పౌర కేంద్రీకృత సంస్కరణలను ఉపయోగించి అధిక-నాణ్యత గల పట్టణ మౌలిక సదుపాయాలను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అందిస్తుంది. సమర్థంగా, ఉత్పాదకంగా, సమ్మిళితంగా, వాతావరణ ప్రభావాలను తట్టుకునేలా ఉండే నగరాలను నిర్మించడం... దేశ ఆర్థిక వృద్ధి తదుపరి దశకు కీలక చోదక శక్తిగా ఆ నగరాలను నిలపడం ఈ నిధి లక్ష్యం.

ఈ నిధి 2025?-26 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు అమలులో ఉంటుంది. అమలు వ్యవధిని 2033-34 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించవచ్చు. నగరాలను వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, నగరాల సృజనాత్మక పునరాభివృద్ధి, నీరు-పారిశుధ్యానికి సంబంధించిన ప్రతిపాదనలను అమలు చేయడానికి 2025-26 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రభుత్వ దార్శనికతపై ఇది ప్రభావం చూపుతుంది.

# భక్తిశ్రద్ధలతో అమరేశ్వరుని గ్రామోత్సవం

-భక్తిశ్రద్ధలతో అమరేశ్వరుని గ్రామోత్సవం



అమరావతి, ఫిబ్రవరి 16: పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరుని గ్రామోత్సవం ఇవాళ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించుకున్న బాల చాముండికా సమేత అమరేశ్వరుడు నంది, చిలుక, రథం వాహనాలపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. నూతన దంపతులైన బాల చాముండికా సమేత అమరేశ్వరునికి భక్తులు విరివిగా హాజరై కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు విరివిగా హాజరయ్యారు. నవ దంపతులు ఆలయం నుండి క్రోసూరు రోడ్డు జంక్షన్ వరకు ఊరేగింపుగా వచ్చి వెనుతిరిగి ఆలయంలోకి వెళ్లారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో అమరేశ్వరుని గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కర్రెద్దుల రేఖ, పాలకమండలి సభ్యులు, అర్చకులు, వేద పండితులు, భక్తులు రథాన్ని లాగి ఊరేగింపులో పాల్గొన్నారు.

# సమ్మెలో 'సొసైటీ' ఉద్యోగులు

## -పీఏసీఎస్‌లను మూసేయొద్దు
## -ఉద్యోగుల ఆందోళన

అమరావతి, ఫిబ్రవరి 16: పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలు) మూతపడనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు సోమవారం ఆందోళన బాట పట్టారు. పీఏసీఎస్‌లను మూసివేయకుండా సహకార రంగాన్ని బలోపేతం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం



సమ్మె చేపట్టారు. ఉద్యోగుల ప్రకారం, సహకార సంఘాలు రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి కీలక సేవలు అందిస్తున్నాయి. పీఏసీఎస్‌లను మూసి వేస్తే రైతాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని పేర్కొన్నారు. సమ్మె కారణంగా కొన్ని ప్రాంతాల్లో సహకార సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు.

# నార్త్-సౌత్ బ్లాకుల స్థానంలో నూతన కార్యాలయాల పేర్లను 'సేవా తీర్థ్' - 'కర్తవ్య భవన్'లుగా మార్చే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఈ రోజు 2082 విక్రమ నామ సంవత్సర... ఫాల్గుణ కృష్ణ పక్షం... విజయ ఏకాదశి... 1947 శక సంవత్సరం... మాఘ మాసం 24వ రోజు పవిత్ర సందర్భంలో...

ఫిబ్రవరి 13, 2026 తేదీన ప్రధానమంత్రి నూతన కార్యాలయాన్ని గౌరవనీయ ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. ఇక మీదట దీనిని 'సేవా తీర్థ్'గా పిలుస్తారు.

దేశాన్ని వలస పాలన సంకెళ్లతో బంధించి ఉంచిన బ్రిటిష్ వారు నార్త్-సౌత్ బ్లాక్‌లను నిర్మించారు. 1947లో దేశం వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటికీ, ఈ భవనాల్లోనే అప్పటి ప్రభుత్వం తన విధుల నిర్వహణ కొనసాగించింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్‌లోని ఈ భవనం నుంచే పనిచేస్తోంది.

ఈ రోజు సౌత్ బ్లాక్‌లోని ఈ చాంబర్‌లో చివరిసారిగా కేంద్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుండటం మాకు సంతోషంగా ఉంది. ఇది కేవలం స్థల మార్పు క్షణం మాత్రమే కాదు... ఇది చరిత్ర, భవిష్యత్తుల సంగమ క్షణం కూడా. బానిసత్వం నుంచి స్వేచ్ఛ వరకు... ఆపై స్వతంత్ర భారత్ వరకు అనేక చారిత్రక సంఘటనలను ఈ భవన సముదాయం ప్రత్యక్షంగా చూసింది, అనుభూతి చెందింది. దేశంలోని 16 మంది ప్రధానమంత్రుల నాయకత్వంలో ఏర్పాటైన మంత్రివర్గాలు తీసుకున్న కీలక నిర్ణయాలకూ ఈ సముదాయం సజీవ సాక్ష్యంగా నిలిచింది. నెహ్రూ జీ నుంచి ప్రస్తుత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ వరకు వారందరి పాదముద్రలు ఈ భవనపు మెట్లపై ఉన్నాయి. ఈ భవనం మెట్లు ఎక్కిన నేతల నిర్ణయాలు దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాయి.

గత దశాబ్దాల్లో, ఇక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశాలు రాజ్యాంగ ఆదర్శాల నుంచి, ప్రజల నుంచి వచ్చిన తీర్పు నుంచి, దేశపు ఆకాంక్షల నుంచి స్ఫూర్తిని పొంది అనేక కీలక నిర్ణయాలను తీసుకున్నాయి. ఇక్కడే భారత విజయాలను వేడుకలా జరుపుకున్నారు... వైఫల్యాలను మదింపు చేశారు... సంక్షోభాలు, సవాళ్లను ఎదుర్కోవడానికి బలమైన, కీలకమైన నిర్ణయాలనూ తీసుకున్నారు.

సౌత్ బ్లాక్ గదులు విభజన కాలపు భయానక దృశ్యాలను... యుద్ధాలు, అత్యవసర పరిస్థితుల సవాళ్లనూ, శాంతి సమయంలో విధానాలపై చర్చలనూ ప్రత్యక్షంగా చూశాయి. టైప్‌రైటర్ల నుంచి డిజిటల్ గవర్నెన్స్ దాకా సాగిన సాంకేతికత అపూర్వ వృద్ధినీ ఇవి అనుభూతి చెందాయి.


ఇక్కడ కూర్చున్న అనేక తరాల అధికారులు దేశాన్ని స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే అనిశ్చితి నుంచి బయటకు తీసుకువచ్చి, సుస్థిరతా మార్గంలో ముందుకు తీసుకెళ్లే నిర్ణయాలను తీసుకున్నారు. అందరి ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు ఆర్థిక సవాళ్లు, సంక్షోభాల నుంచి బయటపడి మన దేశం ఆత్మవిశ్వాసానికి మారుపేరుగా నిలిచింది.

నేటి భారతం ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. భారత్ సురక్షితమైన, సమర్థ దేశంగా ఆవిర్భవించింది. ప్రపంచ వేదికలపైన సుస్పష్టంగా, ప్రభావవంతంగా తన గళాన్ని వినిపిస్తోంది.

గడిచిన దశాబ్ద కాలంలో మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ నాయకత్వంలో మన దేశం తీసుకున్న అనేక చరిత్రాత్మక నిర్ణయాలకు ఈ సౌత్ బ్లాక్ కేంద్రంగా ఉంది. ఈ ప్రదేశం మినిమమ్ గవర్నమెంట్, మాగ్జిమమ్ గవర్నెన్స్ నినాదంతో స్ఫూర్తిదాయక ప్రదేశంగా మారింది. ఇక్కడి నుంచే ప్రారంభమైన సంస్కరణల ఎక్స్‌ప్రెస్ దేశవ్యాప్తంగా ఉత్సాహంతో పరుగులు పెట్టింది. ఇక్కడి నుంచే డీబీటీ, స్వచ్ఛ భారత్ అభియాన్, పేదల సంక్షేమానికి సంబంధించిన ప్రచారాలు, డిజిటల్ ఇండియా, జీఎస్టీ వంటి అనేక సంస్కరణలు రూపుదిద్దుకున్నాయి. ఇక్కడి నుంచే ఆర్టికల్ 370 వంటి అడ్డు గోడలను కూల్చివేయడం, ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం చేయడం వంటి సామాజిక న్యాయ సంబంధిత సాహసోపేతమైన, సున్నితమైన నిర్ణయాలను తీసుకున్నారు. భారత్ తన దృఢమైన, నమ్మకమైన భద్రతా విధానం గురించి ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్నిచ్చిన సర్జికల్ స్ట్రైక్, ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడి, ఆపరేషన్ సిందూర్ వంటి నిర్ణయాలూ ఇక్కడి నుంచే వెలువడ్డాయి.

ఈ రోజు మన దేశం అభివృద్ధి చెందిన భవిత సంకల్పంతో ముందుకు సాగుతోంది. దీని కోసం ఆధునిక, సాంకేతిక, పర్యావరణ అనుకూలమైన కార్యాలయం అవసరం. ఇక్కడ పనిచేసే ప్రతి కర్మయోగి ఉత్పాదకతను పెంచుతూ, వారి సేవా సంకల్పాన్ని ప్రోత్సహించేదే ఈ కార్యస్థలం.

ఈ స్ఫూర్తితోనే సౌత్ బ్లాక్ ప్రారంభోత్సవం జరిగిన దాదాపు 95 సంవత్సరాల తర్వాత అంటే ఈ రోజు 13 ఫిబ్రవరి 2026న, భారత ప్రభుత్వం ఈ భవనాలను ఖాళీ చేసి 'సేవా తీర్థ్', 'కర్తవ్య భవన్'లకు మారుతోంది. ప్రతీకాత్మకంగా ఇది దేశం బానిసత్వపు గతం నుంచి 'అభివృద్ధి చెందిన భారత్' భవిత వైపు వేసిన మరో ముందడుగు. గత కొన్ని సంవత్సరాల్లో... మన దేశంలో చాలా ఏళ్ల పాటు కొనసాగిన 'అధికార' సంస్కృతి స్థానంలో 'సేవా' సంస్కృతి బలోపేతమైంది. నేటి ఈ పరివర్తన ఈ విలువలను మరింత బలోపేతం చేస్తుంది.వేల సంవత్సరాల నాటి మన నాగరికత నుంచి తరతరాలకు స్ఫూర్తినిచ్చే "యుగే యుగేన్ భారత్ నేషనల్ మ్యూజియం"లో నార్త్-సౌత్ బ్లాక్‌లనూ భాగం చేయాలని ఈ రోజు మంత్రివర్గం నిర్ణయించింది.




# నోయిడా సెక్టర్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ వరకు 11.56 కి.మీ మేర మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నోయిడా మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా నోయిడా సెక్టర్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ (నోయిడా) వరకు 11.56 కి.మీ పొడవైన మెట్రో మార్గం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ మార్గంలో 8 ఎలివేటెడ్ స్టేషన్లు నిర్మించనున్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నోయిడా, గ్రేటర్ నోయిడా నగరాల్లో మొత్తం మెట్రో రైలు నెట్‌వర్క్ 61.62 కిలోమీటర్లకు చేరుకుంటుంది.

నోయిడా సెక్టర్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ వరకు చేపట్టే ఈ విస్తరణ నగర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ముందడుగుగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ నగరంలోని మెట్రో నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తుంది.

ప్రస్తుతం సరైన రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాల్లో ప్రజా రవాణాను ఈ 11.56 కి.మీల కొత్త మెట్రో మార్గం మెరుగుపరుస్తుంది. దీనితో పాటు అత్యధిక రద్దీ ఉండే కారిడార్లతో ప్రత్యక్ష అనుసంధానాన్ని కూడా కల్పిస్తుంది. ముఖ్యంగా బొటానికల్ గార్డెన్ వద్ద ఢిల్లీ మెట్రోలోని నీలి రంగు మార్గం, మెజెంటా రంగు మార్గాలకు ఇంటర్‌ఛేంజ్ సౌకర్యాన్ని అందిస్తుంది.ఇది కింది వాటితో పాటు నోయిడాలోని కీలక ప్రాంతాలను నిరంతరాయంగా అనుసంధానించనుంది:

సెక్టార్-142లోని అడ్వాంట్ బిజినెస్ పార్క్, సెక్టార్-98లోని స్కైమార్క్ వన్ మాల్, సెక్టార్-93లోని మాల్ ఆఫ్ నోయిడా వంటి వాణిజ్య కేంద్రాలు

సెక్టార్-145లో మైక్రోసాఫ్ట్, సెక్టార్-157లో టీసీఎస్, సెక్టార్-126లో హావెల్స్.. సెక్టార్-132లో ఇన్ఫోసిస్, అడోబ్.. సెక్టార్-135లో కాగ్నిజెంట్, సెక్టార్-127లో ఒరాకిల్ వంటి ప్రముఖ బహుళజాతి సంస్థలు, ఐటీ హబ్‌లు

సెక్టార్-125లోని అమిటీ యూనివర్సిటీ, సెక్టార్-91లోని పంచశీల్ బాలక్ ఇంటర్మీడియట్ కళాశాల, సెక్టార్-44లోని మహామాయ బాలికల ఇంటర్మీడియట్ కళాశాల వంటి విద్యా సంస్థలుప్రధానంగా సెక్టార్-128లోని మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వంటి కీలక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు బొటానికల్ గార్డెన్, సెక్టార్-93 పార్క్ వంటి ప్రధాన పర్యాటక ఆకర్షణలు

మెట్రో నెట్‌వర్క్‌తో ఈ కీలక ప్రాంతాలను అనుసంధానించడం ద్వారా నోయిడా సెక్టార్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ (నోయిడా) వరకు నిర్మించనున్న ఈ మెట్రో కారిడార్ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలకు ఉత్తేజాన్నివ్వనుంది. ఇది ఉద్యోగ, వ్యాపార, విద్యా అవసరాల కోసం ప్రయాణించే వారితో పాటు స్థానిక ప్రజలకు కూడా నగర రవాణాను ఎంతో సులభతరం చేస్తుంది.ట్రాఫిక్ రద్దీ తగ్గింపు: రోడ్డు రవాణాకు మెట్రో రైలు ఒక సమర్థవంతమైన ప్రత్యామ్నాయం. నోయిడా సెక్టార్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ వరకు ఈ కారిడార్ అందుబాటులోకి రావడం వల్ల నోయిడా, గ్రేటర్ నోయిడా నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి. రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడం వల్ల ప్రయాణ సమయం ఆదా అవ్వడమే కాకుండా రోడ్డు భద్రత కూడా పెరుగుతుంది.

# భారతీయ అంకుర వ్యవస్థలోకి వెంచర్ క్యాపిటల్‌ను సమీకరించేందుకు ఉద్దేశించిన 'స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న అంకుర వ్యవస్థకు భారీ ఊతమిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0'కు ఆమోదం తెలిపింది. దేశంలోని అంకుర రంగానికి వెంచర్ క్యాపిటల్‌ను సమీకరించే లక్ష్యంతో రూ. 10,000 కోట్ల మొత్తం నిధితో దీనిని ప్రారంభించారు.

దీర్ఘకాలిక స్వదేశీ మూలధనాన్ని సమీకరించడం, వెంచర్ క్యాపిటల్ వ్యవస్థను బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా ఆవిష్కరణల ఆధారిత వ్యవస్థాపకతను ప్రోత్సహించడం ద్వారా భారత అంకుర ప్రయాణంలో తదుపరి దశను వేగవంతం చేసేలా ఈ పథకాన్ని రూపొందించారు.

'స్టార్టప్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఎఫ్‌ఓఎఫ్ 2.0 భారత్‌ను ప్రపంచంలోని అగ్రగామి అంకుర దేశాలలో ఒకటిగా నిలబెట్టడానికి దశాబ్ద కాలంగా జరుగుతున్న నిరంతర ప్రయత్నాలకు కొనసాగింపుగా నిలుస్తుంది. 2016లో స్టార్టప్ ఇండియా ప్రారంభమైనప్పటి నుంచి భారత అంకుర రంగం అసాధారణ మార్పులకు లోనైంది. అప్పట్లో 500 కంటే తక్కువగా ఉన్న అంకురాల సంఖ్య నేడు 2 లక్షల (డీపీఐఐటీ గుర్తింపు పొందినవి) పైకి చేరుకుంది. విశేషమేమిటంటే 2025 సంవత్సరంలో అత్యధికంగా వార్షిక అంకురాల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్ 1.0 పునాదిపై నిర్మాణం

స్టార్టప్ ఇండియా ఎఫ్‌ఓఎఫ్ 2.0 అనేది 2016లో ప్రారంభించిన 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్' (ఎఫ్‌ఎఫ్‌ఎస్ 1.0) అద్భుతమైన పనితీరుకు కొనసాగింపుగా వస్తోంది. అంకురాలకు నిధుల కొరతను తీర్చడానికి, దేశీయ వెంచర్ క్యాపిటల్ మార్కెట్‌ను ప్రోత్సహించడానికి దీనిని తీసుకొచ్చారు.

ఎఫ్‌ఎఫ్‌ఎస్ 1.0 కింద మొత్తం రూ. 10,000 కోట్ల మూలధనాన్ని 145 ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్స్‌కు (ఏఐఎఫ్) కేటాయించారు. ఈ నిధుల మద్దతుతో సదరు ఏఐఎఫ్‌లు దేశవ్యాప్తంగా ఉన్న 1,370 కంటే ఎక్కువ అంకురాల్లో ఇప్పటివరకు రూ. 25,500 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. ఈ పెట్టుబడులు వ్యవసాయం, కృత్రిమ మేధ, రోబోటిక్స్, వాహనాలు, హరిత సాంకేతికత, ఈ-కామర్స్, విద్యా సాంకేతికత, ఆర్థిక సాంకేతికత, ఆరోగ్య రంగం, అంతరిక్ష సాంకేతికత, జీవ సాంకేతికత వంటి వివిధ కీలక రంగాలలో విస్తరించి ఉన్నాయి.

తొలిసారిగా అంకురాలు ప్రారంభించే వ్యవస్థాపకులను ప్రోత్సహించడం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం, భారత వెంచర్ క్యాపిటల్ వ్యవస్థకు బలమైన పునాది వేయడంలో ఎఫ్‌ఎఫ్‌ఎస్ 1.0 కీలక పాత్ర పోషించింది.

**పథకానికి ఉన్న ముఖ్య లక్షణాలు:**

మొదటి దశ అంకుర వ్యవస్థను నిర్మించగా.. భారతీయ ఆవిష్కరణలను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా ఈ స్టార్టప్ ఇండియా ఎఫ్‌ఓఎఫ్ 2.0ను రూపొందించారు. ఇది ఈ కింది అంశాలకు మద్దతుగా లక్షిత, వేరువేరు నిధుల విధానాన్ని అనుసరిస్తుంది:

డీప్ టెక్, సాంకేతిక ఆధారిత వినూత్న తయారీ: దీర్ఘకాలిక మూలధనం అవసరమయ్యే హై-టెక్ రంగాలలో వినూత్న ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం.

ప్రారంభ వృద్ధి దశ వ్యవస్థాపకుల సాధికారత: కొత్త-వినూత్న ఆలోచనలకు భరోసా కల్పించడం, నిధుల కొరత కారణంగా ప్రారంభ దశలోనే అంకురాలు విఫలం కాకుండా నివారించడం.

దేశవ్యాప్త విస్తరణ: కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా దేశంలోని నలుమూలలా ఆవిష్కరణలు వృద్ధి చెందేలా పెట్టుబడులను ప్రోత్సహించడం.

అధిక-రిస్క్ మూలధన లోటును తీర్చడం: స్వయం సమృద్ధి, ఆర్థిక వృద్ధికి కీలకమైన ప్రాధాన్యత రంగాలకు ఎక్కువ మూలధనాన్ని మళ్లించడం.

దేశీయ వెంచర్ క్యాపిటల్ పునాదిని బలోపేతం చేయడం: ముఖ్యంగా చిన్న ఫండ్స్‌ను ప్రోత్సహించటం ద్వారా దేశీయ పెట్టుబడి వాతావరణాన్ని మరింత మెరుగుపరచడం.

భారత ఆర్థిక పథాన్ని తీర్చిదిద్దడం, పరివర్తనాత్మక ప్రభావాన్ని చూపడంలో స్టార్టప్ ఇండియా ఎఫ్‌ఓఎఫ్ 2.0 కీలక పాత్ర పోషిస్తుందన్న అంచనా ఉంది.

భారతదేశ ఆవిష్కరణల ఆధారిత వృద్ధి ఎజెండాను ముందుకు తీసుకెళ్లడంలో ఈ ఫండ్ అత్యంత కీలకం కానుంది. ప్రపంచ స్థాయిలో పోటీ పడే సామర్థ్యం ఉన్న సాంకేతికతలు, ఉత్పత్తులు, పరిష్కారాలను రూపొందించే అంకురాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ ఫండ్.. దేశ ఆర్థిక దృఢత్వాన్ని బలోపేతం చేయడానికి, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడానికి, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉద్యోగాల సృష్టికి, భారత్‌ను 'ప్రపంచ ఆవిష్కరణల కేంద్రం'గా నిలబెట్టడానికి దోహదపడుతుంది.

వికసిత్ భారత్- 2047 జాతీయ దార్శనికతకు అనుగుణంగా రూపొందించిన ఈ ఫండ్ వ్యవస్థాపకులను సాధికారత వైపు నడిపించడానికి, ఆవిష్కరణలను పెంపొందించడానికి, భారత అంకుర వ్యవస్థలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వ నిరంతర నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది.

# మైనారిటీల అండగా ప్రభుత్వం

## -మాజీ మంత్రి నెట్టెం రఘురాం
## -జగ్గయ్యపేటలో ముస్లిం మైనార్టీ కమిటీ ఏర్పాటు
## -17 మందితో కమిటీ నియామకం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 16: జగ్గయ్యపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కమిటీని మొత్తం 17 మంది సభ్యులతో నియమించినట్లు మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు ఈ కమిటీ ఏర్పాటు జరిగిందని ఆయన వెల్లడించారు. కమిటీలో అధ్యక్షులుగా షేక్ అక్బర్, జనరల్ సెక్రటరీగా గాలిబ్ సైదా షేక్, వైస్ ప్రెసిడెంట్లుగా మిరాహుస్సేన్ షేక్, సోనుమియా షేకూ, ఆడమ్ షేక్ తదితరులను నియమించినట్లు పేర్కొన్నారు. మిగిలిన కార్యవర్గ సభ్యులతో కలిసి ఈ కమిటీ మైనారిటీల సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేస్తుందని నెట్టెం రఘురాం ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా హజ్ యాత్రకు ఒక్కో యాత్రికుడికి రూ.1 లక్ష రుణ సదుపాయం కల్పించడం పట్ల ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది మైనారిటీల ఆధ్యాత్మిక భావాలను గౌరవించే ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మైనారిటీల అభివృద్ధి కార్యక్రమాలు మరింత బలపడు తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా ముస్లిం సోదరులు విదేశీ విద్య, విదేశీ ఉద్యోగ అవకాశాలకు ప్రోత్సాహం అందించాలని తమ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరగా, దీనిపై సానుకూలంగా స్పందించిన నెట్టెం రఘురాం తప్పకుండా ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మైనారిటీల సామాజిక, ఆర్థిక పురోగతికి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటైన కమిటీ విజయవంతంగా పనిచేసి జగ్గయ్యపేట నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రూ. 3320.38 కోట్ల వ్యయంతో 2 /4 లేన్ల పేవ్డ్ షోల్డర్ అనుసంధాన మార్గంగా పునరుద్ధరణ, అభివృద్ధికి క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: మహారాష్ట్రలోని ఎన్ హెచ్ -160 ఏ లో గల ఘోటీ-త్రయంబక్ (మోఖడ)-జవహర్-మనోర్-పాల్ఘర్ సెక్షన్ పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిన్న ఆమోదం తెలిపింది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్స్ట్రక్షన్ (ఈపీసి) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 154.635 కిలోమీటర్లు కాగా, దీని అంచనా వ్యయం రూ.3,320.38 కోట్లు.

నాసిక్ పశ్చిమ ప్రాంతంలో, ముఖ్యంగా అంబాడ్, సాతపూర్ పరిసరాల్లో మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేసిన పారిశ్రామిక యూనిట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. దీనివల్ల భారీ స్థాయిలో సరుకు రవాణా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ట్రాఫిక్ ఎన్ హెచ్ -848 ద్వారా నాసిక్ నగరం మీదుగా వెళ్తుండటంతో, పట్టణ రహదారులపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ప్రధాన మార్గాలు ఇప్పటికే 'లెవల్ ఆఫ్ సర్వీస్' (ఎల్‌ఓఎస్) - సీ స్థాయికి చేరువలో కొనసాగుతున్నాయి.

ఎన్ హెచ్-160ఏ అభివృద్ధి ద్వారా త్రయంబక్ మీదుగా ఈ పారిశ్రామిక ప్రాంతాల నుంచి ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుంది. ఇది నగరం లోపలికి వెళ్లకుండానే ప్రయాణాన్ని సులభతరం చేస్తూ రద్దీని తగ్గిస్తుంది. ముంబై (పశ్చిమ వైపు), దక్షిణ ప్రాంతాల నుంచి న వచ్చే ట్రాఫిక్ ఎన్ హెచ్ -848 పై గల ఇగత్‌పురి ఇంటర్‌ఛేంజ్ ద్వారా సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేను ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత, ట్రాఫిక్ ఎన్ హెచ్ -848 ద్వారా ఘోటి వరకు సాగి, అక్కడ నుంచి త్రయంబక్, నాసిక్ వెళ్లడానికి ఎన్ హెచ్-160 ఏ మార్గాన్ని ఉపయోగిస్తుంది. 2028 నుంచి రోజువారీ ట్రాఫిక్ 10,000 పీసీయూల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేయడం వల్ల, ఈ కారిడార్‌ను 4 లేన్లుగా మార్చేందుకు అర్హత లభించింది.

త్రయంబక్ నుంచి పశ్చిమంగా మనోర్, పాల్ఘర్ వైపు విస్తరించిన ఎన్ హెచ్ -160ఏ విభాగం, ఈ రహదారిని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌ఈ - 4), ఎన్ హెచ్ -48, పశ్చిమ తీర ప్రాంతాలతో పాటు పాల్ఘర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు అనుసంధానిస్తుంది. ప్రస్తుతం ఈ మార్గంలో 4,500 పీసీయూల ట్రాఫిక్ మాత్రమే ఉన్నప్పటికీ, ఉన్న ఇంటర్మీడియట్-లేన్ రహదారిని పేవ్డ్ షోల్డర్లతో కూడిన రెండు లేన్లుగా అభివృద్ధి చేయడం వల్ల సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలు మరింత సాఫీగా సాగుతాయి. మనోర్ నుంచి పాల్ఘర్ వరకు ఉన్న ఈ రహదారి పట్టణ ప్రాంతాల మీదుగా వెడుతోంది. ఇక్కడ సుమారు 12,000 పీసీయూల ట్రాఫిక్ ఉండటంతో, ఈ పట్టణ విభాగంలో రాకపోకలు సాఫీగా సాగేందుకు నాలుగు లేన్ల విస్తరణను ప్రతిపాదించారు.

ఈ ప్రాజెక్టును పీఎం గతిశక్తి సూత్రాలకు అనుగుణంగా ప్రతిపాదించారు. ఇది మహారాష్ట్రలోని 6 పీఎం గతిశక్తి ఆర్థిక, 1 సామాజిక, 8 రవాణా మార్గాలను అనుసంధానిస్తుంది. దీనివల్ల దేశ లాజిస్టిక్స్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (ఎల్పీఐ) పై సానుకూల ప్రభావం ఉంటుంది.

ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, ట్రాఫిక్ సాఫీగా, సురక్షితంగా సాగుతుంది. దీనివల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, వాహన నిర్వహణ ఖర్చు (వీఓసీ) కూడా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు అమలు వల్ల గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి, సమగ్ర ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 19.98 లక్షల మందికి ప్రత్యక్షంగా, 24.86 లక్షల మందికి పరోక్షంగా పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. వీటితో పాటు, ఈ కారిడార్ వెంబడి అదనపు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయి.

# ఘనంగా నివాళి

## -మండలి వెంకట కృష్ణారావు శత జయంతి
## -రిక్షా కార్మికుల ఆధ్వర్యంలో కార్యక్రమం



అమరావతి, ఫిబ్రవరి 16: అవనిగడ్డ వంతెన సెంటరులో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సోమవారం వారి విగ్రహానికి అవనిగడ్డ రిక్షా యూనియన్ కన్వీనర్ నారేపాలెం శంకరరావు ఆధ్వర్యంలో రిక్షా కార్మికులు సోమేశ్వరరావు, కోటయ్య, నాగేశ్వరరావు, శివ, ఈమని నరసింహారావు, నాగమల్లేశ్వరరావు, పానుగోతు శంకర్, కొల్లు రామస్వామి, కుతాడి భిక్షం, కుతాడి రామారావు, దేవనబోయిన చంద్రం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ప్రతినిధులు, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, చుండూరు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, కూటమి నాయకులు బండే రాఘవ, కూరాకుల శివప్రసాద్, బచ్చు శ్రీహరి, దేగల రాఘవ, పులిగడ్డ బాలు శ్రీనివాస్, ఆకుల సీతామహాలక్ష్మి, డైరెక్టర్ అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, బాలమ్మ, అడపా వెంకటేశ్వరరావు, మండలి రామ్మోహనరావు, లుక్కా వెంకట పిచ్చియ్య, చెన్ను గాంధీ, చెన్ను బాబూరావు, లుక్కా శ్రీనివాసరావు, భోగాది బాలకృష్ణ, బడే సుబ్బారావు, గుగ్గిలం శ్యాంకుమార్, షేక్ మొగల్ మురాద్ బేగ్, బాబావలీ, బషీర్, సోమిరెడ్డి, సీహెచ్ హరి నాథబాబు, బడే సుబ్బారావు, యాసం శ్రీరాములు, మైలా హరిబాబు, కొండవీటి పాండురంగారావు, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, గుడివాక రాము, వాహేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మొక్కుబడి ప్రభ గ్రామోత్సవం



అమరావతి, ఫిబ్రవరి 16: మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ శైవక్షేత్రంలో జరుగుతున్న తిరునాళ్ళ వేడుకలకు మండలంలోని కొత్తలూరు గ్రామం నుండి భక్తులు మొక్కుబడి ప్రభను నిర్మించారు.

వందేళ్ళకు పైగా చరిత్ర కలిగిన మొక్కుబడి ప్రభను ఈ ఏడాది కావూరి వంశస్థులు ప్రభను నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. మహిళలు ఆదివారం ఉదయం ప్రభ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందీశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి ప్రభల ముందు అలంకరించి, మేళతాళాలతో గ్రామపురవీధుల్లో ఊరేగిస్తూ అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించి, మేళతాళాలతో ప్రభను కోటప్పకొండకు తరలించారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొత్తగూడెం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కొత్తగా గెలిచిన కార్పొరేటర్లతో ఆయన సమావేశం అయ్యారు.

అధినేత కేసీఆర్ మీద అభిమానం, మీపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు.

అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించారు. తొలుత బీఆర్ఎస్ కార్పొరేటర్లు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# 18న నిర్వహించే సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి..

## -జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ భీమ్రావు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 16: అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో ఈనెల 18వ తేదీన ,అధికారికంగా శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లాలోని లంబాడి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అదిలాబాద్ జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ భీమ్రావు నాయక్, ప్రధాన కార్యదర్శి చవాన్ వినాయకరావు, గౌరవ అధ్యక్షులు జాదవ్ కృష్ణా నాయక్, లంబాడి జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అడ్వకేట్ ,బానోత్ రామారావు, ఉమ్మడి జిల్లా ముఖ్య సలహాదారులు జాదవ్ రామ్ కిషన్ నాయక్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ నాయక్, ఆడే సురేష్ ,రాథోడ్ సురేష్ ,రాథోడ్ హిరాలాల్ నాయక్ పేర్కొన్నారు.

ఉట్నూరులో నిర్వహించిన సన్నహాక సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సంస్కృతి సంప్రదాయాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ,కార్మికులు, కర్షకులు , యువతి, యువకులు, మహిళలు ప్రతి ఒక్కరు ,అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బంజారా నాయకులు జాదవ్ రెడ్డి నాయక్,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు, రాథోడ్ ఉత్తమ్, జేఏసీ మాజీ అధ్యక్షులు, జాదవ్ బలరాం, జాదవ్ సుభాష్ ఆడే నూర్ సింగ్ నాయక్, రాథోడ్ గణేష్, జాదవ్ అంబారావు , ఆడే సతీష్ ,జాదవ్ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# అస్సాంలో బ్రహ్మపుత్ర నది కింద రెండు వరుసల ట్విన్ ట్యూబ్ టీబీఎం రహదారి ఏర్పాటుకూ కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ 715 సెక్షన్‌లో ఎన్‌హెచ్-15లోని గోహ్‌పూర్ నుంచి నుమాలీగఢ్ వరకు 4-వరుసల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. బ్రహ్మపుత్ర నది కింద 15.79 కిలోమీటర్ల రోడ్ కమ్ రైల్ టన్నెల్‌ను అస్సాంలో రూ.18,662 కోట్ల మూలధన వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు.

ప్రస్తుతం, ఎన్‌హెచ్-715 లోని నుమాలిగఢ్, ఎన్‌హెచ్-15 లోని గోహ్‌పూర్ మధ్య కనెక్టివిటీ ఎన్‌హెచ్-52 లోని సిల్‌ఘాట్ సమీపంలో గల కాలియాభంభోరా రోడ్ వంతెన నుంచి 240 కిలోమీటర్ల దూరంలో ఉంది. నుమాలిగఢ్, కజిరంగా జాతీయ ఉద్యానవనం, బిశ్వనాథ్ పట్టణం గుండా సాగే ఈ ప్రయాణానికి 6 గంటలు పడుతుంది.

# నాలుగు వరుసల రహదారులుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ గుజరాత్‌లో 107.67 కిలోమీటర్ల మేర 4 వరుసల రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. రూ. 4,583.64 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ధమాసియా-బిటాడా, మోవి (47.46 కి.మీ), నాసర్‌పూర్-మలోథా (60.21 కి.మీ) సెక్షన్లను హెచ్‌ఏఎం విధానంలో నిర్మించనున్నారు.

రాజస్థాన్‌లోని ఈ రహదారి నింబాహెరా వద్ద ప్రారంభమై, గుజరాత్‌లోని దాహోద్, మధ్యప్రదేశ్‌లోని అలీరాజ్‌పూర్ జిల్లాల గుండా తిరిగి గుజరాత్‌లోని ఛోటా ఉదయ్‌పూర్ జిల్లాలో ప్రవేశించి, వాపి సమీపం లోఎన్ హెచ్-48తో కలిసే జంక్షన్ వద్ద ముగుస్తుంది.నర్మదా ఆకాంక్షిత జిల్లా నుంచి ఆమోదించిన ఈ ప్రాజెక్టు లు వెళతాయి. ఇవి దాహోద్, ఛోటా ఉదయ్‌పూర్, తాపి, భరూచ్‌లోని గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచటం ద్వారా ఆ ప్రాంత ఆర్థిక వృద్ధికి, అభివృద్ధికి తోడ్పడతాయి. ఈ ప్రాజెక్టు జాతీయ పర్యాటక కేంద్రమైన ఐక్యతా విగ్రహానికి అనుసంధానతను పెంచుతుంది. ఎన్‌హెచ్-56 నుంచి సుమారు 11 కిలోమీటర్ల దూరంలోని కెవాడియా గ్రామంలో ఈ విగ్రహం ఉంది.

గంటకు 100 కిమీ వేగానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు డిజైన్ రూపొందించారు. దీనివల్ల సగటు వేగం గంటకు 70కి.మీ పెరగటంతో సమయం 40% మేర ఆదా అవుతుంది. దీంతో 2.5 గంటల ప్రయాణం కేవలం 1.5 గంటల్లోనే పూర్తవుతుంది.

107.67 కి.మీ మేర ఆమోదించిన ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 19.38 లక్షల పనిదినాల ప్రత్యక్ష ఉపాధి, 22.82 లక్షల పనిదినాల పరోక్ష ఉపాధి లభిస్తుంది. అంతేకాక, ప్రతిపాదిత కారిడార్ పరిసర ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగటం వల్ల అదనపు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ద్వారా రద్దీ అయిన ఎన్‌హెచ్-56 (175 కి.మీ)లోని జంబుగామ్ (బోడెలి) -మలోథా సెక్షన్‌ను నాలుగు వరసల రహదారిగా విస్తరించే పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టింది. జంబుగామ్ (బోడెలి) నుంచి ధమసియా, మోవి నుండి నాసర్‌పూర్ వరకు గల మార్గాల్లో నవంబర్ 2025లో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ప్యాకేజీలు పూర్తయిన తర్వాత, బోడెలి నుంచి మలోథా వరకు నిరంతరాయమైన 4-వరుసల అనుసంధానం ఏర్పడుతుంది. ఇది ఎన్‌హెచ్-56లో ట్రాఫిక్ రద్దీని తగ్గించటమే కాక, ఎన్‌హెచ్-53, ఎన్‌హెచ్-48, ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌ఈ-4)లతో కనెక్టివిటీని మరింత మెరుగు పరుస్తుంది.

ఎన్‌హెచ్-56లోని ధమసియా-బిటాడా, మోవి (47.46 కి.మీ), నాసర్‌పూర్-మలోథా (60.21 కి.మీ) విభాగాల ప్రాజెక్ట్ మార్గరేఖా చిత్రం

# బాల ఆకాశ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలి

## –ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
## –నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే భువనగిరి పట్టణ కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్



స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బందనాదం బాల ఆకాశ్ మరణించాడని, కావునా ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.2 కోట్ల నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. భువనగిరి ఏరియా ఆస్పత్రిలో బందనాదం బాల ఆకాష్ మృతదేహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మృతి చెందిన బాలుడు నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామమైన రాయపురం వాస్తవ్యుడు. శోకసంద్రంలో మునిగిన బాలుడి కుటుంబ సభ్యులను చిరుమర్తి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంఘటనకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిసన్తూ మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. భువనగిరి మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న బాల ఆకాష్ మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ వచ్చి వివరణ ఇచ్చే వరకు ఇక్కడి నుండి కదిలే ప్రసక్తే లేదన్నారు. స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు ఈత కొట్టేందుకు పొలం వద్దకు వస్తున్నారని రైతు అనేకమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే ఈ సంఘటన జరిగిందని తెలిపారు. ఈ సంఘటనకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి కారకులని, ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉన్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన జిల్లా కలెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుండి గురుకులాల్లో చదువుతున్న వంద మంది విద్యార్థులు ఇలానే మరణించినట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. గురుకులాల్లో నిత్యం ఏదో ఒక సమస్యతో విద్యార్థులు సతమతమవుతూ ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉడకని బియ్యం, కుళ్లిన గుడ్లు, ఫుడ్ పాయిజన్, పాముకాట్ల వంటి అనేక సంఘటనలతో అమాయకమైన వందల మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. పేపర్ ప్రకటనలు, సెల్ఫ్ డబ్బాలతో జిల్లా కలెక్టర్ కాలయాపన చేయడం తప్పా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్న దాఖలాలు జిల్లాలో ఎక్కడా లేవన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులతో సహా అధికారులు కూడా గప్పాలు కొట్టడం తప్పా పేద ప్రజల బాధలు పట్టించుకునే స్థితిలో లేరన్నారు. జిల్లా కేంద్రంలో ఇంత దారుణం జరిగి 24 గంటలు దాటినా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రభుత్వ యంత్రాంగం దీనిపై స్పందించలేదన్నారు. హైదరాబాద్ కు కూత వేటు దూరంలో ఇప్పటికీ ఇలాంటి సంఘటనలు ఎన్ని జరుగుతున్నా కూడా ప్రభుత్వంలో చలనం లేదని, అధికారుల నుండి స్పందన లేదని ఆయన పేర్కొన్నారు.

# 'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

## – కట్టంగూర్ సర్పంచ్ శ్యామల శేఖర్

నల్గొండ, ఫిబ్రవరి 16: ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ అన్నారు. సోమవారం కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను వైద్య సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకున్నారు. ఔషధాల సరఫరా, సిబ్బంది హాజరు, శుభ్రత, వంటి అంశాలపై వైద్యాధికారి శ్వేతతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆస్పత్రిలో శుభ్రత పాటించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ప్రజలు ఆరోగ్య కేంద్ర సేవలను వినియోగించుకోవాలని, చిన్న అనారోగ్య సమస్యలకే పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే చికిత్స పొందాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## –గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న పిఓ
## –ఉట్నూర్ ఐటీడీఏ పివో యువరాజ్ మార్మాట్



ఆదిలాబాద్, ఫిబ్రవరి 16: అదిలాబాద్ ఉట్నూర్ ఐటీడీఏలో ప్రతీ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పివో యువరాజ్ మార్మాట్ అన్నారు. కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

జైనూర్ మండలం గారింగగూడ గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు తమ గ్రామానికి త్రిఫెజ్ విద్యుత్ మంజూరు కల్పించామని, ఇంద్రవెల్లి మండలం కొలంగూడ గ్రామానికి చెందిన ముక్తా వ్యవసాయం లో విద్యుత్ కనెక్షన్ అందించాలని కోరారు. గాదిగూడ మండలం జరి గ్రామానికి చెందిన జంగు ఆర్థిక సహాయం అర్జీ కోరారు,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్‌గా తడక వెంకటేశ్వర్లు

## – వైస్ చైర్‌పర్సన్‌గా కొయ్యడ రజని శ్రీను గౌడ్

నల్గొండ, ఫిబ్రవరి 16: భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్గా తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్‌పర్సన్‌గా కొయ్యడ రజని శ్రీను గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డిపిఓ విష్ణువర్ధన్ రెడ్డి మున్సిపాలిటీలోని 13 మంది కౌన్సిలర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా తడక వెంకటేశ్వర్లు ఎన్నిక నిర్వహించగా దేవరాయ కుమార్ ప్రతిపాదించగా, మూడో వార్డ్ కౌన్సిలర్ రావుల జంగయ్య బలపరిచారు. తడక వెంకటేశ్వర్లుకు మద్దతుగా 8 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ నుండి కుడికాల అఖిలకు మద్దతుగా కౌన్సిలర్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ చక్రపాణి ప్రతిపాదించగా, ఐదో వార్డ్ కౌన్సిలర్ బాతుక లింగస్వామి బలపరిచారు. దీంతో మెజార్టీ కలిగిన కొయ్యడ రజిని శ్రీను గౌడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతు రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

చారిత్రాత్మక, పర్యాటక, హెరిటేజ్ విలేజ్ గా పేరొందిన భూదాన్ పోచంపల్లిని మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా దిద్దుతానన్నారు. చేతి వృత్తుల సంక్షేమ కోసం పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరామ్ మంజుల, కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య యాదవ్, పెద్దల చక్రపాణి, బాతుక లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, జింకల లావణ్య, యాదగిరి ముదిరాజ్, సూరపల్లి రాధిక రమేష్ నేత పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించే 'పీఎం రాహత్' పథకం ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: 'సేవా తీర్థ్'కు ప్రధానమంత్రి కార్యాలయం మారిన తర్వాత తీసుకున్న మొట్టమొదటి నిర్ణయంగా 'పీఎం రాహత్' (పీఎం రాహత్ - రోడ్డు ప్రమాద బాధితుల ఆసుపత్రి నివాసం, నిశ్చయ వైద్యం) పథకం ప్రారంభానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆమోదం తెలిపారు. సేవ, కరుణ, ప్రజల రక్షణే పునాదిగా సాగుతున్న ప్రభుత్వ పరిపాలనా విధానానికి ఇది నిదర్శనంగా ఉంది. రోడ్డు ప్రమాదం తర్వాత తక్షణ వైద్య సహాయం అందకపోవటంతో ఏ ఒక్క ప్రాణం కూడా నష్టపోకూడదనే ప్రభుత్వ నిబద్ధతను ఈ నిర్ణయాన్ని తెలియజేస్తోంది.

భారతదేశంలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల గణనీయమైన సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. వీటిలో చాలా వరకు సకాలంలో వైద్యం అందించటం ద్వారా నివారించొచ్చు. ప్రమాదం జరిగిన మొదటి గంటలోపు బాధితులను ఆసుపత్రిలో చేర్పించగలిగితే దాదాపు 50 శాతం మరణాలను నివారించొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. సేవా తీర్థ్ నుంచి 'పీఎం రాహత్'ను ఆమోదించడం ద్వారా ప్రాణాలను రక్షించే తక్షణ వైద్యానికి, ఆసుపత్రులకు ఆర్థిక భరోసా, ప్రమాద బాధితుల కోసం ఒక నిర్మాణాత్మక అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థకు ప్రధానమంత్రి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు.

ఈఆర్ఎస్ఎస్ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్) 112 హెల్ప్‌లైన్‌తో ఈ పథకాన్ని అనుసంధానించడం ద్వారా ప్రమాద బాధితులు 'గోల్డెన్ అవర్'లోపు ఆసుపత్రికి చేరుకునేలా చర్యలు తీసుకుంటారు. రోడ్డు ప్రమాద బాధితులు, 'రాహ్-వీర్' (సహాయం చేసే వ్యక్తులు) లేదా ప్రమాద స్థలంలో ఉన్న ఎవరైనా సరే 112 నంబర్‌కు డయల్ చేయడం ద్వారా సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రి వివరాలను పొందొచ్చు. అంబులెన్స్ సహాయాన్ని కోరచ్చు. ఇది అత్యవసర సేవా సిబ్బంది, పోలీసు యంత్రాంగం, ఆసుపత్రుల మధ్య వేగవంతమైన సమన్వయానికి వీలు కల్పిస్తుంది.

ఈ పథకం కింద ఏ రకమైన రోడ్డుపైన ప్రమాదం జరిగినప్పటికీ అర్హులైన ప్రతి బాధితుడికి రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది. ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల వరకు ఈ సదుపాయం వర్తిస్తుంది. ప్రాణాపాయం లేని సందర్భాల్లో 24 గంటల వరకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు 48 గంటల వరకు బాధితుడి ఆరోగ్యాన్ని స్థిరపరిచే చికిత్స అందిస్తారు. అయితే ఇది సమగ్ర డిజిటల్ వ్యవస్థ ద్వారా పోలీసు ధ్రువీకరణకు లోబడి ఉంటుంది.

పీఎం రాహత్ పథకాన్ని అత్యంత పటిష్ఠమైన, సాంకేతిక ఆధారిత ఫ్రేమ్‌వర్క్ ద్వారా అమలుచేయనున్నారు. ఇది రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన 'ఈ-డార్ (ఎలక్ట్రానిక్ డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్)' ప్లాట్‌ఫారమ్‌ను, నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో (టీఎంఎస్ 2.0) అనుసంధానిస్తుంది. దీనిద్వారా ప్రమాదం జరిగినట్లు రిపోర్ట్ చేయటం నుంచి మొదలుకొని ఆసుపత్రిలో చేరడం, పోలీసు ధ్రువీకరణ, చికిత్స అందించడం, చివరిగా ఆసుపత్రులకు చెల్లింపులు చేయటం వరకు అంతా డిజిటల్ రూపంలో నిరంతరాయంగా జరుగుతుంది. జవాబుదారీ తనాన్ని పెంచేందుకు ప్రాణాపాయం లేని కేసుల్లో 24 గంటల్లోపు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసుల్లో 48 గంటల్లోపు పోలీసు ధ్రువీకరణ పూర్తి కావాల్సి ఉంటుంది.

ఆసుపత్రులకు చేసే చెల్లింపులు (రీయింబర్స్‌మెంట్) 'మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ఫండ్' (ఎంవీఏఎఫ్) ద్వారా జరుగుతాయి. ప్రమాదానికి కారణమైన వాహనానికి బీమా ఉంటే ఆ మొత్తాన్ని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి తీసుకుంటారు. ఒకవేళ బీమా లేకపోయినా లేదా అది 'హిట్ అండ్ రన్' కేసు అయినా సరే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ద్వారా ఆసుపత్రులకు చెల్లింపులు చేస్తారు. రాష్ట్ర ఆరోగ్య సంస్థ ఆమోదించిన క్లెయిమ్‌లను 10 రోజుల్లోపు చెల్లిస్తారు. దీనివల్ల ఆసుపత్రులకు ఆర్థిక భరోసా లభించి చికిత్సకు ఎలాంటి ఆటంకం కలగదు.

బాధితుల ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ లేదా జిల్లా మెజిస్ట్రేట్ లేదా డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన ఉండే జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ఒక అధికారిని నియమిస్తుంది. ఇది జిల్లా స్థాయిలో జవాబుదారీతనం నిర్ధారిస్తుంది.

'సేవా తీర్థ్' నుంచి ఈ పథకాన్ని ప్రారంభించడం అనేది 'పౌరుడే ప్రథమం' అనే ప్రభుత్వ విధానానికి ప్రతీకగా ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క బాధితుడికి ప్రాణరక్షక చికిత్స అందకుండా ఉండకూడదన్న లక్ష్యంతో భారతదేశ అత్యవసర వైద్య సేవా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఒక నిర్ణయాత్మక కార్యక్రమమే ఈ పీఎం రాహత్.

# తక్కువ సీవో2 ఉద్గారాలుతో పాటు సుస్థిర, సమర్థ రైల్వే కార్యకలాపాలకు మద్దతు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన మూడు (3) ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ. 18,509 కోట్లు. అవి:

పెరిగిన లైన్ సామర్థ్యం రవాణాను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఫలితంగా భారతీయ రైల్వేల కార్యాచరణ సామర్థ్యం, సేవల విశ్వసనీయత పెరుగుతుంది. రైల్వే కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, రద్దీని తగ్గించే లక్ష్యంతో ఈ మల్టీ-ట్రా కింగ్ ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రాజెక్టులు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉన్నాయి. ఇది ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి ద్వారా ఈ ప్రాంత ప్రజలు "స్వయం-సమృద్ధి" సాధించేలా చేస్తుంది. వారి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలనూ పెంచుతుంది.

ఈ ప్రాజెక్టులు పీఎమ్-గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ప్రణాళిక చేసినవి. ఇవి సమీకృత ప్రణాళిక, వాటాదారుల సంప్రదింపుల ద్వారా బహుళ విధాల కనెక్టివిటీని, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించాయి. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణా కోసం సజావైన కనెక్టివిటీని అందిస్తాయి.

ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని 12 జిల్లాలను కవర్ చేసే ఈ మూడు ప్రాజెక్టులు భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను దాదాపు 389 కిలోమీటర్లు పెంచుతాయి.

ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ దాదాపు 97 లక్షల జనాభా కలిగిన సుమారు 3,902 గ్రామాలకు కనెక్టివిటీని విస్తరిస్తుంది.

ప్రతిపాదిత సామర్థ్య పెంపుదల దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది. వాటిలో భాప్లీ ఆనకట్ట, శ్రీ ఘటన్‌దేవి, త్రయం బకేశ్వర్ జ్యోతిర్లింగం, శ్రీ మాతా వైష్ణో దేవి కాత్ర-శ్రీనగర్, హంపి (యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం), బళ్లారి కోట, దరోజీ స్లోత్ బేర్ అభయారణ్యం, తుంగభద్ర ఆనకట్ట, కెంచనగుడ్డ విజయ విఠల ఆలయం వంటి ప్రధాన సందర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి.


ప్రతిపాదిత ప్రాజెక్టులు బొగ్గు, ఉక్కు, ఇనుప ఖనిజం, సిమెంట్, సున్నపురాయి-బాక్సైట్, కంటైనర్, ఆహార ధాన్యాలు, చక్కెర, ఎరువులు, పీవోఎల్ వంటి సరుకుల రవాణాకు ఎంతో అవసరమైన మార్గాలు. సామర్థ్యాన్ని పెంచే ఈ పనుల వల్ల 96 ఎమ్‌టీపీఏ (సంవత్సరానికి మిలియన్ టన్నుల) పరిమాణంలో అదనపు సరుకు రవాణా జరుగుతుంది. రైల్వేలు పర్యావరణ అనుకూలమైన, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా విధానం. వాతావరణ లక్ష్యాలను సాధించడంలో, దేశంలో సరుకు రవాణా వ్యయాన్ని తగ్గించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. చమురు దిగుమతిని (22 కోట్ల లీటర్లు) తగ్గిస్తాయి. సీవో2 ఉద్గారాలను (111 కోట్ల కిలోలు) తగ్గిస్తాయి. ఇది నాలుగు కోట్ల చెట్లను నాటడం ద్వారా పొందే ఫలితానికి సమానం.

# దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పున్న సైలజ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 16: దేవరకొండ నూతన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ను సోమవారం దేవరకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. దేవరకొండ ఆర్డీఓ రమణ రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్‌గా పున్న సైలజా, వైస్ చైర్మన్‌గా జుబేర్య తబస్సుమ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్ సమక్షంలో నూతన పాలకవర్గం ప్రమాణం స్వీకారం చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు తన మీద నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బాలు నాయక్, మాజీ చైర్మన్ నర్సింహాతో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశంలో మౌలిక సదుపాయాలు కల్పించడం కీలకం : కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

హన్మకొండ, ఫిబ్రవరి 16: భారతదేశానికి తగిన ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆహారం, నివాసం, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలు ఇప్పటికీ అత్యంత ప్రాముఖ్యమైనవేనని కాకతీయ




యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన రెండురోజుల జాతీయ సదస్సు 'పాపులిస్ట్ పాలసీస్ ఇన్ పోస్ట్-లిబరలైజేషన్ ఇండియా' ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

సంక్షేమం అవసరమైనప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధి కూడా సమానంగా ముఖ్యమని, దేశంలో ధనిక-పేదల మధ్య అంతరం పెరుగుతున్నదని వివిధ నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. సహానుభూతితోనే సంక్షేమం ప్రారంభమవుతుందని, దానికి బలమైన ఆధారాలు, సమగ్ర ప్రణాళిక, సమర్థవంతమైన అమలు అవసరమన్నారు. బలహీన వర్గాల అవసరాలను తీర్చేందుకు సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, కొన్ని సందర్భాల్లో అవి ఓటర్లను ఆకర్షించే రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయన్నారు.

ఈ విధానాల అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభ పరిస్థితులు పెరిగినప్పటికీ, పారిశ్రామిక వర్గాల్లో ఉత్సాహం నెలకొన్నదని, ఆర్థిక సంస్కరణలకు మానవీయ కోణం అనుసంధానం కావాలని, సంక్షేమం ఆ దృక్కోణంతో ముడిపడి ఉండాలన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగ విశ్రాంత ఆచార్యులు కోదండరావ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుపై విమర్శాత్మక విశ్లేషణ చేశారు. సదస్సులో డీన్ ఆచార్య బి.సురేష్‌లాల్, సెమినార్ జాయింట్ డైరెక్టర్ సంకినేని వెంకట్, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, వి.సత్యనారాయణ, వి.నాగరాజు, విశ్రాంత ఆచార్యులు రఘురాంరెడ్డి, వీరన్ననాయక్, దినేష్‌కుమార్, హరిప్రసాద్, సంజీవరెడ్డి, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లాలో స్కూల్ బస్సుకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

హన్మకొండ, ఫిబ్రవరి 16: సిద్ధిపేట - హనుమకొండ ప్రధాన రహదారిపై ముల్కనూరు అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం ఉదయం ప్రైవేటు స్కూలు బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు ఎల్కతుర్తి మండలం ఇందిరా నగర్ గ్రామంలో ఒక కార్పొరేట్ స్కూల్ ఉంది. ఈ స్కూలుకు చెందిన బస్సు పలు గ్రామాల్లో విద్యార్థులను తీసుకొని స్కూలుకు బయలుదేరింది. ఈ క్రమంలో ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద బస్సును టర్న్ చేస్తున్న క్రమంలో హనుమకొండ వైపు వెళ్తున్న లారీ స్వల్పంగా బస్సును ఢీ కొట్టింది.

ఈ సమయంలో పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై అరుపులు కేకలు వేశారు. కాగా విద్యార్థులు ఉన్న బస్సు ముందు భాగాన భారీగా దెబ్బతింది. అదృష్టవశాత్తు విద్యార్థులకు ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పరిమితికి మించి విద్యార్థులు అధికంగా ఉండడం కూడా ప్రధాన కారణమని స్థానికులు మండి పడుతున్నారు. సంఘటన స్థలాన్ని ముల్కనూర్ ఎస్సై రాజు పరిశీలించారు. లారీ డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఈ సంఘటనలో ఇద్దరు విద్యార్థులు, ఒక క్లీనరు గాయపడ్డారు. లారీ ఢీకొనడంతో బస్సు డోర్ వద్ద ఉన్న క్లీనర్ తో పాటు ఒక విద్యార్థి ఎగిరిపడ్డాడు.

# కౌన్సిలర్ గా ప్రమాణం స్వీకారం చేసిన మల్లెల సరితా శ్రీకాంత్




యాదాద్రి ఫిబ్రవరి 16: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని పదో వార్డు నుండి కాంగ్రెస్ కౌన్సిలర్ గా ఎన్నికైన మల్లెల సరిత శ్రీకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల ప్రత్యేక అధికారి, కృష్ణారెడ్డి ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

# బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

## -ఇక సంపద సృష్టే ఆలస్యం
## -10 సూత్రాలతో స్వర్ణాంధ్ర
## -మైక్రోసాఫ్ట్ రాకతో అభివృద్ధికి దోహద
## -బిల్ గేట్స్ భేటీలో ఏపీ సీఎం పవర్ ప్రజంటేషన్

అమరావతి, ఫిబ్రవరి 16: ఏపీలో అన్ని వనరులు ఉన్నాయి, ఇప్పుడు సంపద సృష్టి జరగాలి. బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు



కృషి చేస్తున్నాం, అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ అమరావతి పర్యటన సందర్భంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర విజన్ 2047, ప్రభుత్వ పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పాడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. 1997లో తొలి సారి తాను బిల్ గేట్స్‌ను కలిసిన సంగతి, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు జరిగిన తీరును గేట్స్ సమక్షంలో సీఎం గుర్తు చేశారు.

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. ఏపీలోని వివిధ ప్రాజెక్టులకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో తెచ్చిన మార్పులు -సాధించిన ఫలితాలపైనా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటన చారిత్రాత్మకం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ పర్యటన దోహదం చేస్తుంది, అని ఆశాభావం వ్యక్తం చేశారు. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలబడింది అన్నారు.

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానం. ఇందుకు టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్నాం. అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుంది. డేటా- ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నాం. ఎలక్ట్రానిక్స్- ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నాం, అని సీఎం చంద్రబాబు వివరించారు.

రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నాం. విద్యా రంగంలో అధునిక విధానాలను పాటిస్తున్నాం. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తున్నాం. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నాం. రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నాం. మెరుగైన ప్రజారోగ్య సేవలు అందించేందుకు అత్యున్నత స్థాయి నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేశాం. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ విధానం ప్రజలకు ముందస్తుగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం, సీఎం చంద్రబాబు తన ప్రజంటేషన్‌లో సవివరంగా తెలిపారు.

ఈ సమావేశంలో పలు అంశాలపై సెక్రటేరియేట్లోని సమావేశ మందిరంలో సీఎం, మంత్రులు, సెక్రటరీలతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశంలో ఇన్నోవేషన్స్, వేగవంతమైన నిర్ణయాలు, చర్యలు అద్భుతంగా ఉన్నాయని బిల్ గేట్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు. డిజిటల్ విప్లవానికి భారతదేశంలో బలమైన పునాదులు పడ్డాయన్నారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని బిల్ గేట్స్ కితాబు ఇచ్చారు.

తాను మొదటిసారి సీఎం చంద్రబాబును కలిసినప్పటి విషయాలను ఈ సమావేశంలో ఆయన గుర్తు చేశారు. ప్రపంచ దేశాల్లో తాను కలిసిన ఎంతో మంది నాయకుల ఆలోచనల కంటే చంద్రబాబు ఆలోచనలు చాలా ముందున్నాయని తొలి భేటీలోనే తాను గ్రహించానని బిల్ గేట్స్ తెలిపారు. నాటి సింగపూర్ ప్రధాని కూడా చంద్రబాబు తరహా భిన్నమైన, విజన్‌తో కూడిన ఆలోచనలు చేసేవారని బిల్ గేట్స్ వివరించారు. గేట్స్ ఫౌండేషన్ ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఈ ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని ఆయన వివరించారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి, కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని బిల్ గేట్స్ ప్రశంసించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి వారికి సరైన రీతిలో తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి సహాయ పడుతుందని వివరించారు. విద్యారంగంలో అద్భుతమైన మార్పులు తీసుకురావడానికి ఏఐ- టెక్నాలజీ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

వ్యవసాయం రంగ చాలా ముఖ్యమైన రంగమని చ ఈ రంగం ఎంత ముఖ్యమో ఇప్పటికీ చాలా మందికి తెలియదని బిల్ గేట్స్ ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించడాన్ని బిల్ గేట్స్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. టెక్నాలజీని రైతులకు అందించేందుకు ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేసేందుకు ఏపీ కృషి చేస్తోందని బిల్ గేట్స్ అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఎఐ టెక్నాలజీని వినియోగంచడం లేదని కానీ ఆంధ్రప్రదేశ్ దాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండం మంచి పరిణామమని ఆయన వెల్లడించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలతో ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు కావడం బాగుందని బిల్ గేట్స్ అభినందించారు.

డిజిటల్ గవర్నెన్స్ అనే ఆలోచనను ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పడానికి తాను ప్రయత్నిస్తున్న సమయంలో సీఎం చంద్రబాబు దాని గురించి ఆలోచన చేయడమే కాకుండా అమలు చేశారని బిల్ గేట్స్ ప్రశంసించారు, డ్రోన్లతో వివిధ రకాల సేవలు వినియోగించుకునే ఆలోచన అద్భుతంగా ఉంది, మలేరియా, అనీమియా జబ్బుల నివారణ కోసం అందరం కలిసి పని చేయాలని బిల్ గేట్స్ సూచించారు.

సమావేశంలో పలు అంశాల పై బిల్ గేట్స్ కు మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ ప్రశ్నలు వేసి ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నారు. హైదరా బాద్‌లో మైక్రో సాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు కారణమేంటని పయ్యావుల ప్రశ్నించగా దీనికి బిల్‌గేట్స్ ఆసక్తికర సమాధానం చెబుతూ, నాడు చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని బిల్ గేట్స్. చెప్పారు.

అదే సమయంలో చంద్రబాబు మైక్రో సాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్ లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టారని దీనిపై తమ వద్ద పని చేసే టెకీల అభిప్రాయం కోరితే హైదరా బాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారని బిల్ గేట్స్ వివరించారు.

ఇప్పుడు కూడా భారత దేశంలో మైక్రో సాఫ్ట్ కంపెనీల్లో పని చేసే చాలా మంది ఉద్యోగుల్లో హైదరాబాద్ నిపుణులే ఎక్కువగా ఉన్నారని బిల్ గేట్స్ వివరించారు.

## 13 దేశాల ప్రత్యేక పెవిలియన్లకు వేదికకానున్న ఎక్స్‌పో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: 2026 ఫిబ్రవరి 16న సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026'ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు.

ఈ ఎక్స్‌పోను ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'తో పాటుగా నిర్వహించనున్నారు. ప్రభుత్వ విధానాలతో ఆచరణను, ఆవిష్కరణలతో విస్తృతిని, సాంకేతికతతో సామాన్య పౌరుడిని ఒకచోట కలిసే ఈ వేదిక.. కృత్రిమ మేధ విషయంలో ఆచరణాత్మక పనితీరును చాటిచెప్పే జాతీయ ప్రదర్శనగా నిలుస్తుంది.

70,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో 10 ఏరినాల్లో విస్తరించి ఉన్న ఈ ఎక్స్‌పో.. అంతర్జాతీయ సాంకేతిక సంస్థలు, అంకురాలు, విద్యా - పరిశోధనా సంస్థలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అంతర్జాతీయ భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకొస్తుంది. ఏఐ వ్యవస్థలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రతిబింబించేలా 13 దేశాల పెవిలియన్లు ఈ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇందులో ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజికిస్థాన్, ఆఫ్రికా దేశాల ప్రదర్శనలు ఉంటాయి.

ఈ ఎక్స్‌పోలో 'ప్రజలు, పృథ్వీ, ప్రగతి' అనే మూడు ప్రధాన చక్రీయ ఇతివృత్త ఆధారంగా 300కు పైగా ప్రత్యేక ప్రదర్శనలు, ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయి. ఇందులో 600కు పైగా అధిక సామర్థ్యం గల అంకురాలు పాల్గొంటున్నాయి. వీటిలో చాలా వరకు ప్రపంచ స్థాయికి సరితూగేలా, భారీ జనాభా అవసరాలకు తగ్గట్టుగా ఏఐ పరిష్కారాలను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితుల్లో అమల్లో ఉన్న తమ పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శిస్తాయి.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు- 2026కు అంతర్జాతీయ ప్రతినిధులతో సహా 2.5 లక్షల మందికి పైగా సందర్శకులు వస్తారన్న అంచనా ఉంది. ఈ కార్యక్రమం అంతర్జాతీయ ఏఐ వ్యవస్థలో కొత్త భాగస్వామ్యాలను పెంపొందించడం, సరికొత్త వ్యాపార అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# మున్సిపల్ చైర్మన్ ఎన్నికల పరిశీలకులను ప్రకటించిన కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 16: । మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియలో అధికార కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న అరాచకాలు, కుట్రల నేపథ్యంలో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. రేపు ఎన్నికలు జరగనున్న కీలకమైన హంగ్ మున్సిపాలిటీల కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా ఎన్నికల ఇంఛార్జిలను నియమించారు. ఈ మేరకు కేటీఆర్ ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జిలతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.

స్థానికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలను అడిగి తెలుసుకున్న కేటీఆర్.. పార్టీ స్థానిక నాయకత్వానికి అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ అరాచకాల నేపథ్యంలో స్థానిక నాయకత్వానికి అన్ని విధాలా అండగా నిలబడేందుకు, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు పార్టీ తరఫున సీనియర్ నాయకులను ప్రత్యేక ఇంఛార్జిలుగా పంపుతున్నట్లు ప్రకటించారు.

కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నేతలు వెంటనే తమకు కేటాయించిన మున్సిపాలిటీలకు బయలుదేరి వెళ్లారు. రేపు ఎన్నికలు జరగనున్న 8 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టంగా ఛైర్మన్ పీఠాలను గెలుచుకునే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. 8 పట్టణాలకు సీనియర్ నేతలను ఇంఛార్జిలుగా నియమించారు.

# తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నల్గొండ, ఫిబ్రవరి 16: ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.మునుస్వామి, తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ టంగుటూరి సైదులు, డాక్టర్ వేముల వెంకటేశం, ఎన్.కోటయ్య, జి.గోవర్ధనగిరి, ఎన్.ప్రభాకర్, డి.అంజయ్య, తెలంగాణ సాహితీ జిల్లా కోశాధికారి తరునోజు భీష్మాచార్య, పందిరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కుకుడాల గోవర్ధన్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'డ్రగ్స్ రహిత సమాజం సుస్థిర భవిష్యత్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు తాము రాసిన వ్యాసాన్ని సంబంధిత కళాశాలల తెలుగు శాఖలో ఈ నెల 19 వరకు అందజేయాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు కన్సోలేషన్ బహుమతులు హైదరాబాద్‌లో జరిగే దశాబ్ది ఉత్సవాల్లో అందజేయబడతాయని పేర్కొన్నారు.

# టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ టీఏఎల్ హెల్త్ ఫెస్ట్ 2026




హైదరాబాద్, ఫిబ్రవరి 16: ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఆరోగ్య సంరక్షణ అండ్ వెల్నెస్ సదస్సు టీఏఎల్ హెల్త్ ఫెస్ట్ 2026 ను టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ నిర్వహించింది. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును పునర్నిర్మించడంపై దృష్టి సారించిన చర్చలు, సహకార పరివర్తన కోసం విధాన నిర్ణేతలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, సామాజిక ప్రభావ నాయకులను విజయవంతంగా ఒక చోట చేర్చింది.

ఈసందర్భంగా టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ సీఈఓ సాయి గుండవెల్లి మాట్లాడుతూ టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ద్వారా, ఆరోగ్య సంరక్షణ అత్యంత అవసరమైన చోట విస్తరించడానికి తాము సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. మెరుగైన వైద్య సేవలను పొందలేనట్టి రోగులను ప్రో బోనో కేర్ అందించే ఆసుపత్రులతో టిఏఎల్ హాస్పిటల్స్ అనుసంధాని స్తుందన్నారు. ఆరోగ్య సంరక్షణ అనేది కేవలం స్థానికంగా మాత్రమే కాదు అది నిజంగా గ్లోకల్ అని నిరూపిస్తుందన్నారు. తాము ప్రపంచవ్యాప్తంగా వైద్యులను అనుసంధానించే ప్రపంచ వేదిక అయిన టీఏఎల్ మేడోరాను ప్రారంభిస్తున్నామన్నారు. భారతదేశం తమ 1.4 బిలియన్ల మంది ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కేవలం మూడు మిలియన్ డాలర్లను మాత్రమే ఖర్చు చేస్తున్నందున, సాంకేతికత, సహకారం ఈ అంతరాన్ని డబ్బు ద్వారా కాదు, ప్రజలు తమ సమయాన్ని, నైపుణ్యాన్ని స్వచ్ఛందంగా అందించడం ద్వారా తగ్గించగలవని తాము విశ్వసిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని టి-హబ్‌లో ఈ సమావేశం ప్రారంభమైంది. కర్ణాటక ప్రభుత్వ క్యాబినెట్ మంత్రి ఎన్.ఎస్. బోస్‌రాజు ప్రారంభోపన్యాసం చేశారు.

మనం సైన్స్ అండ్ టెక్నాలజీలో పెట్టుబడి పెడుతున్న వేళ, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో సైతం పెట్టుబడి పెడుతున్నామన్నారు. సాంకేతికత అపారమైన ప్రభావాన్ని చూపగలదన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వ్యక్తి కూడా ఆవిష్కరణల మద్దతుతో ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ నుండి ప్రయోజనం పొందవచ్చన్నారు. భారతదేశాన్ని ప్రపంచ ఆవిష్కరణ నాయకుడిగా నిలబెట్టాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టీఏఎల్ హెల్త్ ఫెస్ట్ వంటి వేదికలు ఈ లక్ష్యాన్ని వేగవంతంగా చేరుకోవటానికి తోడ్పడతాయన్నారు. ఈ ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సమర్థించడానికి, సాంకేతిక పురోగతి ప్రతి పౌరుడికి చేరేలా చేయటానికి కర్ణాటక ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

ఏహెచ్ పిఐ వ్యవస్థాపకుడు, ఏహెచ్ పిఐ తెలంగాణ అధ్యక్షుడు గోవింద హరి మాట్లాడుతూ? కొవిడ్ తర్వాత, ప్రభుత్వం, లాభాపేక్షలేని సంస్థలు, ఆసుపత్రుల మధ్య భాగస్వామ్యాలు నాణ్యత, లభ్యత, రెండింటినీ విస్తరించడానికి తప్పనిసరి అయ్యాయని నొక్కి చెప్పారు. డేటా భద్రత, పాలన, జీవిత భవిష్యత్తు అండ్ వ్యాక్సిన్ ఆర్ అండ్ డి లో విప్లవాత్మక ఆవిష్కరణలు, ఎంఆర్ఎన్ఏ, కాంజుగేట్ వ్యాక్సిన్లు, ప్రెసిషన్ డెలివరీ టెక్నాలజీలో పురోగతితో సహా ఆకట్టుకునే అంశాలపై కీలకోపన్యాసాలు జరిగాయి. ఏఐ, క్వాంటం సాంకేతికతలు, తదుపరి తరం డేటా వేదికలు ఔషధ ఆవిష్కరణ, రోగ నిర్ధారణలు, రోగి సంరక్షణను ఎలా మార్చగలవో నిపుణులు చర్చించారు.

ఈ సదస్సులో కీలకవక్తలుగా మార్క్ లీ (సోలిక్స్ టెక్నాలజీస్), నిషిత్ దేశాయ్ అండ్ మిహిర్ పారిఖ్ (నిషిత్ దేశాయ్ అసోసియేట్స్ ), అండ్ డాక్టర్ రమేష్ మాటూర్ (ఎఖీఔం థెరప్యూటిక్స్) ఉన్నారు. ఈ చర్చా కార్యక్రమాలను ఉదయ్ సక్సేనా (వేల్ ట్యాంక్ బయోక్యాటలిస్ట్), మురళీ కృష్ణం, జో లాంకాస్టర్, రాజు మానపాటి (సోలిక్స్ టెక్నాలజీస్), డాక్టర్ బాల విద్యాధర్ మల్లాది (పుష్పగిరి విట్రియో రెటినా ఇన్స్టిట్యూట్), గోపాల్ గార్గ్ (అశోక) మోడరేట్ చేశారు. డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ (ఫెర్నాండెజ్ హాస్పిటల్), అన్షు గుప్తా (గూంజ్), దీపిక టి. గ్రంధి (క్లీవ్‌ల్యాండ్ క్లినిక్) భారతదేశం, అంతర్జాతీయంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ నాయకులతో సహా 30మందికి పైగా ప్రముఖ ప్యానలిస్టులు పాల్గొన్నారు.

# భారత్ పర్వ్ వేదికగా భారత్‌ను గ్లోబల్ కంటెంట్ హబ్‌గా ప్రదర్శిస్తున్న వేవ్స్ బజార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రెడ్‌ఫోర్ట్‌లో జరిగిన భారత్ పర్వ్‌లో భాగంగా నిర్వహించిన వేవ్స్ బజార్... ప్రపంచ సినిమా నిపుణులు, సాంకేతిక ఆవిష్కర్తలు, విధాన రూపకర్తల కీలక సమావేశానికి వేదికగా నిలిచింది. వేవ్స్ (వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్) కార్యక్రమం కింద నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమం... సినిమా, మీడియా, అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక సాంకేతికతల్లో విస్తరిస్తున్న భారత్ ప్రభావాన్ని స్పష్టం చేస్తూనే "గ్లోబల్ కంటెంట్ ఫ్యాక్టరీ"గా పెరుగుతున్న భారత్ స్థాయినీ చాటి చెప్పింది.

భారత ఏవీజీసీ, చలనచిత్ర రంగాలకు "ముందుకు సాగే మార్గం" గురించి ఎన్ఎఫ్‌డీసీ జీఎమ్ శ్రీ గౌతమ్ భానోత్ ప్రారంభ వ్యాఖ్యలతో ఈ నాటి కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్ఎఫ్‌డీసీ మీడియా, కమ్యూనికేషన్ జనరల్ మేనేజర్ విదుషి క్రైన్ మోడరేట్ చేసిన "ఇండియా యాజ్ ఎ గ్లోబల్ కంటెంట్ ఫ్యాక్టరీ: స్కేల్, టాలెంట్, న్యూ బిజినెస్ మోడల్స్" అనే ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చ, అంతర్జాతీయ కథలను నడిపించడంలో పెరుగుతున్న బారత్ సామర్థ్యాన్ని అన్వేషించింది. మార్టైన్ రాబర్ట్స్ (ఐఎఫ్ఎఫ్ఆర్ ప్రో), కాథరినా సక్కేల్ (బాంబే బెర్లిన్ ఫిల్మ్ ప్రొడక్షన్స్), టామాసో ప్రియాంటే (లుమినాలియా)లతో కూడిన ఈ చర్చ... ఫిల్మ్ బజార్, వేవ్స్ బజార్ వంటి వేదికలతో పాటు వేవ్ఎక్స్, సీఐసీ ఛాలెంజ్ వంటి ప్రభుత్వ -మద్దతు గల కార్యక్రమాలు భారత చిత్ర నిర్మాణ స్థాయిని ఎలా బలోపేతం చేస్తున్నాయి, ప్రతిభను ఎలా పెంపొందించుకుంటున్నాయి, సరిహద్దు సహకారాలను ప్రారంభించడం ద్వారా సృజనాత్మక రంగాలు, ఆవిష్కరణలకు ప్రపంచస్థాయి పోటీ కేంద్రంగా దేశాన్ని ఎలా నిలుపుతున్నాయో స్పష్టం చేసింది.

ప్రాంతీయ చలనచిత్ర పర్యాటకానికి గణనీయ ప్రోత్సాహకంగా ఢిల్లీ, మహారాష్ట్రలు తమ వ్యూహాత్మక అజెండాలను ప్రదర్శించాయి. పర్యాటకం, కళలు, సాంస్కృతిక శాఖల మంత్రి (ఢిల్లీ) శ్రీ కపిల్ మిశ్రా, ఢిల్లీ పర్యాటక రంగ కోసం ప్రజెంటేషన్‌కు నాయకత్వం వహించారు.

చలనచిత్ర నిర్మాతల కోసం రాజధాని పున రుద్ధరించిన విధానాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

ఈ కార్యక్రమ అనంతరం సాంస్కృతిక శాఖ మంత్రి (మహారాష్ట్ర) శ్రీ ఆశిష్ షెలార్ మహారాష్ట్ర ఫిల్మ్ సిటీపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. స్థానిక, అంతర్జాతీయ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి సమగ్ర నిర్మాణ మద్దతును, ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడానికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారం కోసం ఇరువురు మంత్రులను సత్కరించారు.

ప్రపంచస్థాయి సహ-నిర్మాణాలపై ప్రధానంగా దృష్టి: కురింజి ప్రాజెక్ట్

ఫిబ్రవరి 13న జరిగిన భారత్ పర్వ్‌లో యూరోపియన్ ఫిల్మ్ మార్కెట్‌లోని వేవ్స్ బజార్ గ్లోబల్ ఔట్‌రీచ్ ప్రతినిధుల బృందం తమ ఇండియా- ఫ్రాన్స్- జర్మనీ సహ- నిర్మాణ నమూనాపై ప్యానెల్ చర్చ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రూపొందించిన కురింజిని ఫీచర్‌ను ప్రదర్శించింది. ఈ సమావేశంలో రచయిత-దర్శకురాలు పాయల్ సేథి, ఆమె అంతర్జాతీయ నిర్మాణ భాగస్వాములు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్‌డీసీ వేవ్స్ ఫిల్మ్ బజార్ సహ-నిర్మాణ మార్కెట్‌లో బెర్లినేల్ టాలెంట్స్ ఫెలోషిప్, మొదటి బహుమతి సాధించిన కురింజి అనేది వలస, గుర్తింపు, సమర్థను అన్వేషించే ఒక పాత్ర-ఆధారిత నాటకం... దీనిని కేరళలో రూపొందించారు. అంతర్జాతీయ ఎమ్మీ-విజేత సిరీస్ ఢిల్లీ క్రైమ్ ద్వారా పేరుగాంచిన ఫిల్మ్‌కారవాన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ బలమైన సరిహద్దు సహకారాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సముచిత రీతిలో కథలను చెప్పడంలో పెరుగుతున్న భారత్ ఉనికిని ఇది స్పష్టం చేసింది.


"ఫిల్మ్ మేకర్స్, టెక్ స్టార్టప్స్ ఓపెన్ పిచ్'' అనే ప్రత్యేక విభాగంలో విభిన్న శైలులు, ప్రాంతాలను కవర్ చేస్తూ తొమ్మిది ఫీచర్ ఫిల్మ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో సహ-నిర్మాణ భాగస్వాములను ఆశిస్తున్న హిందీ-జపనీస్ మిస్టరీ డ్రామా కబూతర్... వలసలను అన్వేషించే ఆర్ట్-హౌస్ డ్రామా యే మేరా ఘర్ (మై హోమ్)... తమిళ-ఇంగ్లీష్ యానిమేటెడ్ పిల్లల ఫీచర్, ఫైనాన్సింగ్‌లో ఎక్స్ఆర్ ప్రాజెక్ట్ అయిన ది గోట్ ఉన్నాయి.

ఫిబ్రవరి 13న భారత్ పర్వ్‌లో ప్రదర్శించిన ఇతర ప్రాజెక్టుల్లో అవార్డు గెలుచుకున్న హిమాలయన్ డ్రామా ఎకోస్ ఆఫ్ ది హెర్డ్... 1980ల నాటి యూకే-సెట్ కమింగ్-ఆఫ్-ఏజ్ మ్యూజికల్ వైట్ గై... కొంకణి-హిందీ ఫాంటసీ రొమాన్స్ మిస్టర్ ఫ్రాన్సిస్ అండ్ ది లాస్ట్ స్టాండింగ్ పీసీవో... బెర్లిన్-ఇండియా డ్రామా కాన్విడోర్ (స్టిల్ సమ్‌వేర్)... నాగాలాండ్ నుంచి టెన్నిడీ కమింగ్-ఆఫ్-ఏజ్ కథ అడే (ఆన్ ఎ వీకెండ్)... జైలులో సాగే హిందీ డ్రామా ICE-PICE ఉన్నాయి.

క్రూబెల్లా వికేంద్రీకృత ఫెస్టివల్ మోనిటైజేషన్ ప్లాట్‌ఫామ్, టూటీఫ్రూటీ గేమ్స్ ఏఐ-ఆధారిత పౌరాణిక గేమింగ్ ఐపీ, జాంగో జనరేటివ్ ఏఐ లోకలైజేషన్ సాధనాలు, ఫోక్‌లాగ్ యానిమేషన్-నేతృత్వంలోని జానపద వారసత్వ వేదికను కలిగిన వేవ్ఎక్స్ ప్రదర్శన ద్వారా ఆవిష్కరణలను మరింత హైలైట్ చేశారు.

# తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి

**ఫిబ్రవరి 17... పాలగుమ్మి పద్మరాజు వర్ధంతి**



తెలుగు కథా సాహిత్యంలోప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 2915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పీ.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు.

తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనంలోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి.

తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లిష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది.

"గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ "గాలివాన" మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది.

ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి.


అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఈయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు.

ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజు కు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. 'బంగారుపాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్‌వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనకోని అతిథీ'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు.

దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజు ను 'మా గురువుగారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు.

తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు.

ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
**9440595494**

# రాహుల్ గాంధీ ధోరణి మార్పు వచ్చిందా?

న్యూస్ డిల్లీ ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్); లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ ధోరణి ఎట్టకేలకు దారిన పడుతున్నట్లు భావించవచ్చునా? 202627వ సంవత్సరపు బడ్జెట్‌పై ఆయన సభలో ఈ నెల 11న చేసిన ప్రసంగాన్ని బట్టి ఈ ఆశాభావం కలుగుతున్నది. ఆయన నేరుగా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చించి ఉండకపోవచ్చుగాక. లేదా మొత్తం మీద బడ్జెట్ తీరుతెన్నులను విశ్లేషించి మంచి చెడులను ఎత్తిచూపక పోవచ్చు. ఆ పని రానున్న రోజులలో కాంగ్రెస్ వక్తలు, ఇతర ప్రతిపక్ష వక్తలు చేయగలరు. కాని, దేశ ఆర్థికంతో సంబంధం గల అమెరికా వాణిజ్య ఒప్పందపు తీరు, అందువల్ల భారత దేశానికి కలిగే నష్టమంటూ తాను భావించే అంశాలను ప్రస్తావించారు. అది ప్రశంసించ దగిన విషయం. ఇక్కడ ఒక సందేహం కలగవచ్చు. ప్రతిపక్ష నాయకుని స్థానంలో ఉన్న వ్యక్తి చేయవలసిని పనే ఇది అయిన పుడు తనను ప్రత్యేకంగా అభినందించటం ఎందుకని. ఎందుకంటే, రాహుల్ గాంధీ ఆ స్థానం నుంచి పార్లమెంటులో గాని, కాంగ్రెస్ నాయకునిగా బయట గాని తను చేయవలసిన ఎనులు అరుదుగా తప్ప చేయటం లేదు. చేయటం లేదన్న మాట స్వయంగా కాంగ్రెస్ వాదులకు, కాంగ్రెస్ నాయకత్వాన గల ప్రతిపక్ష కూటమి వారికి, అధికార పక్షమైన బిజెపికి, బయట సాధారణ ప్రజలకు కూడా అర్థమైంది. అందుకు అందరూ విసుగు పడుతుండగా బిజెపి సంతోషిస్తున్నది. ఆయన నాయకునిగా ఉన్నంతకాలం తమ అధికారానికి ముప్పు లేదని వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్‌లోనూ అసంతృప్తి పెరుగుతున్న స్థితిలో, పార్టీ నాయకునిగా రాహుల్‌ను తప్పించి ప్రియాంకకు బాధ్యతలు అప్పగించటం వల్ల ప్రయోజనం ఉండవచ్చుననే మాటలు ఇటీవల తిరిగి వినవస్తున్నాయి. మిగిలిన వారిని అట్లుంచి సాక్షాత్తూ ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా అటువంటి సూచన చేయటం తగినంత కలకలాన్ని సృష్టించింది. ఎవరైనా తాము చేయవలసినది చేయకుండా తక్కినవి ఎంత బాగా చేసినా దానిని లోకం మెచ్చదు. రాహుల్ అదే పని చేస్తూ వచ్చారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలనే ముందుగా తీసుకుంటే, ఆయన మాజీ సైన్యాధిపతి జనరల్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలతో భూకంపం సృష్టించాలని చూసారు. అందులో గల్వాన్ ఘటనల గురించిన ప్రస్తావన తప్పక చర్చించదగినదే. దానిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నది మొదటనే స్పష్టమైంది. ఒక కారణం, అది ఇంకా అధికారికంగా వెలువడ లేదు. రెండవది, గల్వాన్ ఉదంతం సందర్భంగా 'ఏది ఉచితమని భావిస్తే అది చేయండి' (జో ఉచిత్ సమ్‌ఝే వో కరో) అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అప్పటి సైన్యాధిపతితో చెప్పారంటున్న మాటకు పలు విధాలైన నిర్వచనా లను వింటున్నాము. వాటిలో తను భావించిన నిర్వచనం ఏమి టో ఆ అధికారి పేర్కొనలేదు. ఇపుడు ప్రభుత్వమూ ఆ చర్చకు సిద్ధంగా లేదు. అటువంటి స్థితిలో రాహుల్ గాంధీ ఎంత సేపని, ఎన్ని రోజులని సభా సమయాన్ని అందుకోసం ఉపయోగించగలరు? +విషయమేమంటే, ప్రతిపక్ష స్థానంలో కాంగ్రెస్ ఒక్కటే లేదు. వారి కూటమిలో, కూటమికి బయట ఇతర పార్టీలు కూడా ఉన్నాయి. నరవణె పుస్తకం విషయమై వారికి కూడా ఆందోళన ఉన్నా, సభా సమయం యావత్తూ రోజుల తరబడి అందుకే ఖర్చు కావటం వారికి నచ్చలేదు. తాము మాట్లాడదలచుకున్నవి తమకున్నాయి. పైగా ఇవి బడ్జెట్ సమావేశాలు. ఆ దృష్ట్యా రాహుల్ ధోరణి వారికి నచ్చలేదని, అంతర్గతంగా ఆయనపై విమర్శలు మొదలయ్యాయని వార్తలు సూచించాయి. ఆయన బుధవారం నాడు నరవణె విషయం వదలి వేసి బడ్జెట్ గురించి మాట్లాడటానికి కారణం అదేనని భావించవలసి వస్తున్నది. వాస్తవానికి దేశానికి కావలసింది ప్రధానంగా బడ్జెట్ గురించిన చర్చ. 2020 నాటి గల్వాన్ గురించి నోటీసు ఇచ్చి మరొక సందర్భంలోనైనా చర్చించవచ్చు. బడ్జెట్ చర్చను ఆపి మరీ అందుగురించి చర్చించవలసిన అత్యవసర స్థితి ఏమీ లేదు. ఆ మాట రాహుల్ గాంధీకి స్వయంగా అర్థం కాలేదు. తన ధోరణిపట్ల ఇతర ప్రతిపక్షాల నిరసనతో బోధ పడింది. ఆ విధంగా ఆయన ధోరణి ఆ వత్తిడి వల్ల దారిన పడిందన్న మాట. రాజ్యాంగ దుమారం విశేషమేమంటే తను గతంలోనూ ఇదే విధంగా వ్యవహరించారు కొన్ని సార్లు. తనకు సరైనదని తోచిన సంచలనాత్మక విషయమేదో ముందుకు తెస్తారు. దానిని ప్రస్తావించటంతో ఆగక రోజుల తరబడి సభలోనూ బయటా హంగామా సృష్టిస్తారు. ఇతర ప్రతిపక్షాలకూ, బయటి నుంచి టివిలలో చూసే ప్రజలకూ విసుగు తెప్పిస్తారు. ఇతర ప్రతిపక్షాల వత్తిడి మీదట ధోరణి మార్చుకుంటారు. ఆయనకు ఇదొక అలవాటుగా మారింది. మనం ఇరవై ఏళ్లుగా గమనిస్తున్న తన నాయకత్వంలోని అనేక లోపాలలో ఇది ఒకటి. సభలోనే కాదు. ఇతర విషయాలలోనూ అంతే. ప్రజల సమస్యలు, వారు తన నుంచి ఆశించేది ఒకటైతే, ఆయన మరేవో భుజాన వేసుకుంటారు. అవి ప్రజలకు పట్టవు. ఇటీవలి కాలానికేవస్తే, కాంగ్రెస్ అసెంబ్లీ సీట్లు మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్‌లలో గతం కన్న తగ్గింది ఎందుకు.. ఆ కారణాలను ఆయన సమీక్షించుకున్నారో లేదో తెలియదు గాని, బయటి వారికి అర్థమవుతూనే ఉన్నాయి.

## బిజెపి మేయర్ ఉన్నదగ్గర రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వదిలేది లేదు

**-బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక**



హైదరాబాద్ ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత రాజకీయాలు పక్కన పెట్టాలని బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలోకి దిగామని అన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ప్రజా తీర్పును పక్కన బెట్టి కాంగ్రెస్ కుట్రలు చేసిందని విమర్శించారు. బిజెపి బలపడితే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. కరీంనగర్ గడ్డపై బిజెపి జెండా ఎగురవేశామని, 80 ఏళ్ల కల నెరవేరిందని బండి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల వెనుక ఎన్నో కుట్రలు కుతంత్రాలు జరిగాయని, ఎన్ని చేసినా ప్రజలు ధర్మం వైపే నిలబడ్డారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి మాటిచ్చా.. కరీంనగర్ లో గెలిపించానని, కరీంనగర్ అభివృద్ధికి కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులనూ కలుస్తామని అన్నారు. బిజెపి మేయర్ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వదిలేది లేదని హెచ్చరించారు. బిఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలన్నీ కలిసి సాధించింది ఏంటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో తాము గెలిచినా.. మేయర్ గా ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కుట్రలు కలిశాయని బండిసంజయ్ పేర్కొన్నారు.

## కోరుట్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**-కోరుట్ల చైర్పర్సన్ ,వైస్ చైర్మన్ తిరుమల వసంత -గంగాధర్, మహమ్మద్ షహీద్**



రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 16: నేటినిజం (ప్రతినిధి): కౌన్సిల్ సభ్యుల సహకారంతో వేములవాడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని నూతన ఎన్నికైన కోరుట్ల చైర్పర్సన్ పుల్కం రాజు ఆన్నారు. సోమవారం నూతన ఎన్నికైన చైర్ పర్సన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక 'మోడల్ మున్సి పాలిటీ' గా (ఆదర్శవంతంగా) తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రజాప్రతినిధుల, కౌన్సిల్ సభ్యుల సహకారంతో కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన నమ్మ కమే ఈ విజయానికి కారణమని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడకుండా ముందుకు సాగుతా మని పేర్కొన్నా రు. వేములవాడ పట్టణ అభివృద్ధి కి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

## నిజామాబాద్‌లో సెంచరీ మ్యాట్రెస్సెస్ అండ్ సోఫాస్ కొత్త ఎక్స్‌పీరియన్స్ స్టోర్ ప్రారంభం




నిజామాబాద్. ఫిబ్రవరి 16, దక్షిణ భారతదేశంలో తన ఉనికిని మరింత బలోపేతం చేస్తూ, మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రముఖ స్లీప్ స్పెషలిస్ట్ బ్రాండ్ సెంచరీ మ్యాట్రెస్సెస్ అండ్ సోఫాస్ నిజామాబాద్‌లోని వినాయక నగర్‌లో తన కొత్త ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ఘనంగా ప్రారంభించింది. తెలంగాణ వ్యాప్తంగా తన రిటైల్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించాలనే లక్ష్యంలో భాగంగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కొత్త స్టోర్ ద్వారా నిజామాబాద్‌లోని వినియోగదారులకు అత్యాధునికమైన నిద్ర మరియు సౌకర్యవంతమైన సోఫా పరిష్కారాలు మరింత చేరువయ్యాయి. గ్రాండ్ లాంచ్ వేడుకల్లో భాగంగా, ఈ ప్రారంభోత్సవ సమయంలో వినియోగదారులు మ్యాట్రెస్ కొనుగోలుపై 20 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. వీటితో పాటు అర్హత కలిగిన కొనుగోళ్లపై పిల్లోస్, బెడ్ షీట్లు, మ్యాట్రెస్ ప్రొటెక్టర్లను ఉచితంగా అందిస్తున్నారు. అంతేకాకుండా, ఎంచుకున్న యాక్సెసరీలపై బై 1 గెట్ 1 ఆఫర్ అందుబాటులో ఉంది. దీనివల్ల వినియోగదారులు తమ బెడ్రూమ్ సౌకర్యాలను మరింత సులభంగా మెరుగుపరుచుకోవచ్చు. దీనికి అదనంగా, మ్యాట్రెస్ కొనుగోలు చేసే వారికి సోఫాలపై 40 శాతం వరకు భారీ తగ్గింపు లభిస్తుంది. తద్వారా తమ బెడ్రూమ్, లివింగ్ రూమ్ రెండింటినీ ఒకేసారి సరికొత్త సౌకర్యాలతో ఆధునీకరించుకునే అవకాశం కలుగుతుంది.

# వేములవాడ మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు ఎన్నిక

**-వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ బాధ్యతలు**



రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి రాజన్న ఆలయంలో లో భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఒక్క కౌన్సిలర్ మాత్రమే ఉన్న పరిస్థితి నుంచి నేడు మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ప్రజల ఆశీర్వాదంతో సాధ్యమైందని పేర్కొన్నారు. మొన్నటి ఎన్నికల్లో గత ప్రభుత్వం చేయని పనులను గత రెండు సంవత్సరాల్లో పూర్తి చేసిన విషయాలను ప్రజలకు వివరించి ఓటు కోరామని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు తమపై నమ్మకం ఉంచారని అన్నారు. వేములవాడ గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రస్తుతం పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. తమ పనులకు ప్రజలు "పాస్ మార్కులు" ఇచ్చినట్లుగా ఈ విజయం భావిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని నూతన పాలకవర్గం హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని, జిల్లా ఇంచార్జి మంత్రుల సహకారంతో వేములవాడను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. వేములవాడ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఆనందంగా ఉందని పేర్కొంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలబడతామని నూతన పాలకవర్గం స్పష్టం చేసింది.

## స్వల్ప తేడాతో విజయం.. ఇది శాశ్వతం కాదు

**ఈ ఫలితాన్ని తిరగరాస్తాం..ఎంపి ధర్మపురి అరవింద్**

నిజామాబాద్ ఫిబ్రవరి 16 (ఎక్స్ ప్రేస్స్ న్యూస్) ;నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయి త్వరలోనే ఈ ఫలితాన్ని తిరగరాస్తాం:.. ఎంపి ధర్మపురి అరవింద్ ధ్వజం నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక వేదికగా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటయ్యాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. బిజెపిని దెబ్బతీసేందుకు సిద్ధాంతాలను పక్కనబెట్టి ఈ మూడు పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం నగర మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ తీరును, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా-ఈ కారు రేసు వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని అరవింద్ ప్రశ్నించారు. ఒకవైపు విమర్శలు చేస్తూనే, మరోవైపు బిఆర్ఎస్ అభ్యర్థులను కాంగ్రెస్ వాహనాల్లో ఎక్కించుకుని తీసుకురావడం వెనుక ఉన్న మర్మమేమిటని ఆయన అడిగారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు ఎందుకు మద్దతు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని ఎంపి ఆరోపించారు. "కొందరు పోలీసులు రాజకీయ రంగు పూసుకుని మరీ పనిచేశారనీ విమర్శించారు. బిఆర్ఎస్ అభ్యర్థిని కాంగ్రెస్ వ్యానులో కూర్చోబెట్టి తీసుకురావడంలో పోలీసుల హస్తం ఉందని స్పష్టంగా కనిపిస్తోంది'' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు.

స్వల్ప తేడాతో విజయం.. ఇది శాశ్వతం కాదు

బిజెపి అభ్యర్థి స్రవంతి రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి కేవలం మూడు స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించారనీ పేర్కొన్నారు. అలాగే ఎంఐఎం అభ్యర్థి, బిజెపి అభ్యర్థి బంటు రాముపై గెలవడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఉందని విమర్శించారు. ఈ ఎన్నిక ఫలితం ముగిసిపోయిన అధ్యాయం కాదు. ఈ బాడీ గడువు ముగియక ముందే, ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తాం, ప్రజాక్షేత్రంలో అక్రమ పొత్తులను ఎండగడతాం'' అని అరవింద్ హెచ్చరించారు. గెలిచిన మేయర్, డిప్యూటీ మేయర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్

**-మున్సిపల్ 28 మంది కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం**




రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల అనంతరం మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ పదవీలకు సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. వేములవాడ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఎన్నుకోబడ్డారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా 15 వార్డు కౌన్సిలర్ పుల్కం రాజు వైస్ చైర్మన్ గా 21 వార్డు కౌన్సిలర్ నరాల శేఖర్ ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు ( కాంగ్రెస్) మైలారపు శ్రీనివాస్( బిజెపి) పోటీ పడగా పుల్కం రాజుకు 17 కౌన్సిలర్లు మద్దతు తెలపడం, మైలారపు శ్రీనివాస్ కు 8 గురు బిజెపి కౌన్సిలర్లు మద్దతును తెలిపారు. దీనితో పుల్కం రాజును వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున చైర్ పర్సన్ బీఫామ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మున్సిపల్ అధికారులకు అప్పజెప్పగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండి కౌన్సిలర్ పుల్కం రాజు మద్దతు తెలిపారు. సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిస్తాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com